E KABURU - Digital News Paper
E-PAPER
# ఈ-కబురు
@ekaburu.com
ఎల్లప్పుడూ విశ్వసనీయ సమాచారం
హైదరాబాద్ (తేదీ) 19-01-2026 (వారం) సోమవారం సంపుటి: 02 || సంచిక: 19|| పేజీలు–6 www.ekaburu.com



సూచీల స్థిరీకరణకు అవకాశం!
» 4లో

# మోదీ సర్కారుపై పోరుకు దండు కడదాం

» వారిని గద్దె దించితేనే ప్రజాస్వామ్యం బతుకుతుంది
» సీపీఐ శతాబ్ది ఉత్సవాల ముగింపు సభలో సీఎం రేవంత్‌రెడ్డి
» భాజపా అంటే బ్రిటిష్ జనతా పార్టీ అని మండిపాటు
» కాంగ్రెస్ పోరాటానికి కలిసి రావాలని కమ్యూనిస్టులకు పిలుపు

**ఈ-కబురు, ఖమ్మం: ప్రజాస్వామ్యాన్ని బతికించుకోవాలని కోరుకునే ప్రతి ఒక్కరూ దండు కట్టి మోదీ ప్రభుత్వంపై పోరాటం ప్రకటించాలని సీఎం రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. వారిపై కాంగ్రెస్ చేస్తున్న పోరులో కలిసి రావాలని కమ్యూనిస్టులకు సూచించారు. కాంగ్రెస్ అయినా, కమ్యూనిస్ట్ అయినా, ఇంకెవరైనా సరే అప్రమత్తంగా ఉండాల్సిన అవసరమొచ్చిందన్నారు. అంతా కలిసి మోదీని గద్దె దింపుదామని.. రాహుల్‌గాంధీని ప్రధానిని చేద్దామన్నారు. సీపీఐ శతాబ్ది ఉత్సవాల ముగింపు సందర్భంగా ఖమ్మంలో ఆదివారం జరిగిన బహిరంగసభకు సీఎం హాజరయ్యారు.**

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివ రావు అధ్యక్షతన జరిగిన సభలో సీపీఐ ప్రధాన కార్యదర్శి రాజా, ముఖ్యనేతలు అమర్‌జిత్‌కౌర్, కె.నారాయణ తదితరులు పాల్గొన్నారు. సీఎం మాట్లాడుతూ.. ''దేశంలో మతతత్వ శక్తులకు వ్యతిరేకంగా ఎర్రజెండా కొట్లాడుతుందని ఖమ్మం గడ్డపై నుంచి నినదించినందుకు కమ్యూనిస్టులను మనస్ఫూర్తిగా అభినందిస్తున్నా. పేదలు, ఆదివాసీ, గిరిజనుల కోసం నిరంతరం కొట్లాడతామని నినదిస్తున్న కమ్యూనిస్టులను స్ఫూర్తిగా తీసుకొని మొన్నటి ఎన్నికల్లో ప్రభుత్వాన్ని పడగొట్టాం. నేడు ఈ వేదికపై నుంచి ఈ రాష్ట్రాన్నే కాదు.. దేశాన్ని పట్టిపీడిస్తున్న శక్తులను ఓడించడానికి మనం ప్రతిజ్ఞ చేయాల్సిన అవసరముంది.

ఎర్రజెండా నినదిస్తే కాంగ్రెస్ చట్టం చేసింది.. నాడు బ్రిటిష్‌వారికి వ్యతిరేకంగా నేషనల్ కాంగ్రెస్, కమ్యూనిస్టులు.. కలిసి కొట్లాడితేనే దేశానికి స్వాతంత్ర్యం వచ్చింది. దున్నేవాడిదే భూమి అని ఎర్రజెండా నినదిస్తే.. దాన్ని చట్టం చేసిన చరిత్ర కాంగ్రెస్ పార్టీది. జమీందార్లు, జాగీర్దార్లు, భూస్వాముల దగ్గరున్న భూములను పేదలకు పంచింది ఇందిరాగాంధీ, పీవీ నరసింహారావు, బూర్గుల రామకృష్ణారావులే. రైతు కూలీలు వెట్టిచాకిరీ చేస్తుంటే.. వాళ్ల హక్కుల కోసం పోరాడింది మీరు. అందుకే కనీస వేతనచట్టాన్ని కాంగ్రెస్ తీసుకొచ్చింది. రైతుకు గిట్టుబాటు ధర దక్కడం లేదంటూ రైతుకూలీ సంఘాలను కట్టి మీరు పోరాటాలు చేశారు. దళారులను అడ్డు తొలగించి రైతుకు మద్దతు ధర నిర్ణయించింది కాంగ్రెస్. నాడు రజాకార్లకు, నిజాం నవాబులకు వ్యతిరేకంగా సాయుధ రైతాంగ పోరాటాన్ని నిర్మించి 4,000 మంది ఎర్రజెండా వీరులు నేలకొరిగితేనే హైదరాబాద్ రాష్ట్ర విముక్తికి పునాదులు పడ్డాయి.

తరువాయి 2లో




## మేడారం జాతరకు ఆర్టీసీ టికెట్ రేట్లు ఖరారు..




ఈ-కబురు,హైదరాబాద్: మేడారం సమ్మక్క–సారక్క జాతరకు వెళ్లే భక్తుల కోసం తెలంగాణ ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడపనుంది. ఈ సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి మేడారానికి వెళ్లే టిక్కెట్ చార్జీలను ఖరారు చేసింది. హైదరాబాద్ నుంచి రూ.600 నుంచి రూ.1,110 వరకు.. వరంగల్ నుంచి రూ.250 నుంచి రూ.500 వరకు చార్జీలు నిర్ణయించింది.

తరువాయి 2లో

## కోహ్లి విరోచిత పోరాటం వృథా.. ఇండోర్‌లో భారత్ ఓటమి



» 6లో

## నైనీ బొగ్గు గని టెండర్ నోటిఫికేషన్ రద్దు

» నిబంధనలపై ఆరోపణలు రావడంతో నిర్ణయం
» ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క వెల్లడి



» 2లో

## గ్రీన్‌లాండ్ సుంకం' ఘోర తప్పిదం



లండన్: గ్రీన్‌లాండ్ విషయంలో తమకు మద్దతు తెలపని దేశాలపై 10శాతం అదనపు సుంకాలను విధిస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన ప్రకటనపై బ్రిటన్‌తోపాటు ఈయూ దేశాలు మండిపడ్డాయి. అదనపు సుంకాల హెచ్చరిక ఘోర తప్పిదమని బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్ స్పష్టం చేశారు. ఎటువంటి బెదిరింపులకు లొంగబోమని ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మెక్రాన్ వ్యాఖ్యానించారు.

తరువాయి 3లో

# ఘనంగా గోదావరి పుష్కరాలు

» బాసర నుంచి భద్రాచలం వరకు టెంపుల్ సర్క్యూట్
» మెట్రో విస్తరణ కోసం భూసేకరణకు రూ.2,787 కోట్లు
» వీలైనంత త్వరగా మున్సిపల్ ఎన్నికలు
» హైదరాబాద్‌లో 9 కి.మీ. కొత్త బ్రిడ్జి నిర్మాణం
» రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయాలు




**ఈ-కబురు, హైదరాబాద్ : వచ్చే ఏడాది జులై 23 నుంచి ఆగస్టు 3 వరకు గోదావరి పుష్కరాలను ఘనంగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకోసం ఇప్పటి నుంచే ప్రణాళికలు రూపొందించాలని అధికారులను క్యాబినెట్ ఆదేశించింది. 'బాసర నుంచి భద్రాచలం వరకు రాష్ట్రంలో గోదావరి పరీవాహక ప్రాంతంలో ఉన్న అన్ని ప్రధాన ఆలయాలు, పురాతన ఆలయాలు, ఎకో టూరిజం అభివృద్ధి చేయడానికి సంబంధించి త్వరలో క్యాబినెట్ సబ్ కమిటీ ఏర్పాటవుతుంది. బాసర నుంచి భద్రాచలం వరకు టెంపుల్ సర్క్యూట్‌ను అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలి.**

దేవాదాయ, రెవెన్యూ, అటవీ, పర్యాటక, పురావస్తు శాఖలు సంయుక్తంగా మార్చి 31 నాటికి సమగ్ర నివేదికను రూపొందించాలి' అని అధికారులకు మంత్రివర్గం స్పష్టమైన ఆదేశాలు చేసింది. సమ్మక్క, సారలమ్మ మహా జాతర నేపథ్యంలో ములుగు జిల్లా మేడారంలోని హరిత హోటల్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన ఆదివారం రాష్ట్ర మంత్రివర్గం సమావేశమైంది. హైదరాబాద్ వెలుపల.. అందులో మారుమూల గిరిజన ప్రాంతంలో రాష్ట్ర క్యాబినెట్ భేటీ కావడం ఇదే తొలిసారి. సుమారు 2 గంటల పాటు సమావేశం జరిగింది. దావోస్‌లో ప్రపంచ ఆర్థిక వేదిక సదస్సులో పాల్గొనడానికి ఇప్పటికే ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు వెళ్లడంతో.. క్యాబినెట్ భేటీలో పాల్గొనలేదు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు సహా ప్రభుత్వ ముఖ్య కార్యదర్శులు, ఉన్నతాధికారులు హాజరయ్యారు. అనంతరం సమావేశ మందిరంలో ఎంపీ బలరాం నాయక్‌తో కలిసి మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస రెడ్డి, సీతక్క క్యాబినెట్ నిర్ణయాలను విలేకరులకు వివరించారు. ''నాటి ఉమ్మడి ఏపీలో గానీ.. ప్రత్యేక తెలంగాణలో గానీ జరగని విధంగా.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో 27వ క్యాబినెట్ సమావేశాన్ని గిరిజనులు, ఆదివాసీల ఆరాధ్య దైవమైన సమ్మక్క, సారలమ్మ కొలువుతీరిన మేడారం పుణ్యక్షేత్రంలో నిర్వహించుకున్నాం. ఇందులో పలు కీలక నిర్ణయాలను మంత్రివర్గం ఆమోదించింది. పునరుద్ధరించిన మేడారం క్షేత్రాన్ని సోమవారం ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, సహచర మంత్రుల సమక్షంలో ప్రారంభించనున్నాం'' అని వారు చెప్పారు.

తరువాయి 2లో



# మహా జంగిల్‌రాజ్‌ను అంతం చేస్తాం

- కేంద్ర పథకాలను టీఎంసీ సర్కారు అడ్డుకుంటోంది
- ఓట్ల కోసం అక్రమ వసలదారులకు మద్దతు
- బెంగాల్ ర్యాలీలో మోదీ

ఈకబురు, సింగూరు/కలియాబోర్, జనవరి 18: తృణమూల్ కాంగ్రెస్ పాలనలోని 'మహా జంగిల్ రాజ్'కు వీడ్కోలు పలకడానికి పశ్చిమ బెంగాల్ సిద్ధంగా ఉందని ప్రధాని మోదీ అన్నారు. ఎన్డీయే బిహార్‌లో 'జంగిల్ రాజ్'ను అంతం చేసిందని గుర్తుచేశారు. పశ్చిమ బెంగాల్‌లోని హుగ్లీ జిల్లా సింగూర్‌లో, అస్సాం రాష్ట్రం కలియాబోర్‌లో ఆదివారం నిర్వహించిన ర్యాలీల్లో మోదీ ప్రసంగించారు. ''ఇండియా గేట్ ముందు సుభాష్ చంద్రబోస్ విగ్రహాన్ని ప్రతిష్ఠించింది బీజేపీ ప్రభుత్వమే. మొదటిసారిగా ఆజాద్ హింద్ ఫౌజ్ సేవలకు ఎర్రకోట వద్ద గౌరవం లభించింది. అండమాన్ నికోబార్ దీవుల్లోని ఒక ద్వీపానికి నేతాజీ పేరు పెట్టాం. మీరు ఢిల్లీలో బీజేపీ ప్రభుత్వాన్ని ఎన్నుకున్నప్పుడే బెంగాలీ భాషకు శాస్త్రీయ హోదా దక్కింది. బీజేపీ ప్రభుత్వం చేసిన ప్రయత్నాల వల్లే దుర్గా పూజకు యునెస్కో ప్రపంచ వారసత్వ హోదా లభించింది. ఒక్క మోదీకి మాత్రమే బెంగాల్‌పై ఇంత ప్రేమ ఉంది' అని ఆయన పేర్కొన్నారు. బెంగాల్‌కు చెందిన రాజారామ్మోహన్ రాయ్, ఈశ్వరచంద్ర విద్యాసాగర్, స్వామి వివేకానంద వంటి మహనీయులను జాతీయ స్థాయిలో గౌరవించింది తమ ప్రభుత్వమేనని స్పష్టం చేశారు. కేంద్ర పథకాలను బెంగాల్ ప్రజలకు అందకుండా టీఎంసీ ప్రభుత్వం అడ్డుకుంటోందని మోదీ ఆరోపించారు. బెంగాల్ పిల్లల భవిష్యత్తును నాశనం చేస్తున్న ఈ ప్రభుత్వాన్ని తొలగించాలో, వద్దో చెప్పాలని ప్రజలను మోదీ కోరారు. రాజకీయ ప్రయోజనాలు, ఓటు బ్యాంకు రాజకీయాల కోసం టీఎంసీ ప్రభుత్వం చొరబాటుదారులకు మద్దతు ఇస్తూ దేశ భద్రతను ప్రమాదంలోని నెడుతోందని మోదీ ఆరోపించారు.

తరువాయి 2లో



యువత ఆరోగ్యంగా ఉంటేనే దేశం అభివృద్ధి
కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

» 3లో



పట్టాలెక్కబోతున్న మమిత లవ్‌స్టోరీ

» 5లో



## నేరాలను ప్రోత్సహించేలా సీఎం మాట్లాడటం సిగ్గుచేటు: కేటీఆర్

ఈ-కబురు, హైదరాబాద్: శాంతిభద్రతలను కాపాడాల్సిన రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉంటూ అసాంఘిక చర్యలను, నేరాలను ప్రోత్సహించేలా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడటం సిగ్గుచేటని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ విమర్శించారు.

తరువాయి 2లో

## మౌని అమావాస్య పుణ్యస్నానాలు 4.5 కోట్లు !



ఈ-కబురు, ప్రయాగ్‌రాజ్ (యూపీ): మౌని అమావాస్య సందర్భంగా ఆదివారం ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లోని త్రివేణిసంగమ స్థలిలో కోట్లాది మంది భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారు. సాయంత్రానికే వారి సంఖ్య 4.52 కోట్లు దాటిందని ఉత్తర ప్రదేశ్ అధికారులు వెల్లడించారు. దట్టంగా కమ్ముకున్న పొగమంచును, వణికించే చలిని సైతం లెక్కచేయకుండా భక్తులు శనివారం అర్ధరాత్రి కల్లా త్రివేణి సంగమ ఘాట్లకు చేరుకున్నారు.

తరువాయి 2లో

# నైనీ బొగ్గు గని టెండర్ నోటిఫికేషన్ రద్దు

ఈకబురు,హైదరాబాద్: ఒడిశాలోని నైనీ ప్రాంతంలో సింగరేణి సంస్థకు చెందిన బొగ్గు గని తవ్వకాలకు సంబంధించిన టెండర్ నోటిఫికేషన్‌ను రద్దు చేయాలని నిర్ణయించినట్లు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క వెల్లడించారు. టెండర్ల దాఖలుకు విధించిన అర్హత నిబంధనలపై ఆరోపణలు రావడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన తెలిపారు. ఆదివారం ప్రజాభవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. ''టెండర్ల దాఖలుకు అర్హత నిబంధనలను సింగరేణి పాలక మండలి ఖరారు చేస్తుంది. నిబంధనలపై ఆరోపణలు వచ్చిన వెంటనే టెండర్లను రద్దు చేయాలని పాలకమండలికి సూచించాను. వివాదం ఎందుకు ఏర్పడిందని నేను అడిగితే... నోటిఫికేషన్ ఇచ్చినా ఇంకా ఎవరూ టెండర్ వేయలేదని సింగరేణి అధికారులు చెప్పారు. అయినా నోటిఫికేషన్‌ను రద్దు చేసి, మళ్లీ టెండర్లు పిలవాలని సూచించాను'' అని భట్టి వివరించారు.

**నైనీ జీఎం ధ్రువీకరణ పత్రం ఇవ్వలేదన్న ఆరోపణలతో వివాదం**

ఒడిశా రాష్ట్రంలోని అంగుల్ జిల్లా నైనీ ప్రాంతంలో ఉన్న బొగ్గు గనిని గతంలో సింగరేణికి కేంద్ర ప్రభుత్వం కేటాయించింది. ఈగనిలో తవ్వకాలు, బొగ్గు ఉత్పత్తి పనులను ఇతర సంస్థలకు అప్పగించేందుకు 'మైన్ డెవలపర్, ఆపరేటర్'(ఎండీఓ) ఎంపిక కోసం టెండర్లను ఆహ్వానిస్తూ గత నవంబరులో సింగరేణి నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ నెల 29లోగా అన్ని ధ్రువీకరణ పత్రాలతో టెండర్లు వేయాలని గడువు విధించింది. ఈ ప్రాజెక్టు కోసం మూలధన వ్యయం కింద రూ.1,604.42 కోట్లు పెట్టుబడిగా పెట్టాలని, ఏటా కోటి టన్నుల బొగ్గు ఉత్పత్తి చేసి సింగరేణికి అప్పగించాలన్న నిబంధన పెట్టింది. రాబోయే పాతికేళ్లపాటు 'ఎండీఓ' కాంట్రాక్టు ఇస్తామని తెలిపింది. టెండర్ వేసే కంపెనీకి గత మూడేళ్లలో వ్యాపార అమ్మకాలపై కనీసం రూ.1,200 కోట్ల ఆదాయం వచ్చి ఉండాలి. టెండర్ దరఖాస్తుతోపాటు రూ.2 కోట్ల డిపాజిట్ చెల్లించాలి. ఈ నోటిఫికేషన్‌లో గని నేపథ్యం(బ్యాక్‌గ్రౌండ్) వివరాలు తెలిపిన అంశాల్లో ఒకటో విభాగంలోని 1.8 నిబంధన ప్రకారం... నైనీకి వెళ్లి, గని తవ్వాల్సిన ప్రాంతాన్ని సందర్శించి, అన్ని వివరాలు తెలుసుకున్నట్లు అక్కడి సింగరేణి జనరల్ మేనేజర్(జీఎం) నుంచి 'ధ్రువీకరణ పత్రం' తీసుకుని టెండర్‌తో పాటు తప్పనిసరిగా దాఖలు చేయాలి. అయితే, తాము గనిని సందర్శించినా అక్కడి జీఎం సర్టిఫికెట్ ఇవ్వలేదని కొన్ని కంపెనీలు ఆరోపించడంతో వివాదం తలెత్తింది. ఈ నేపథ్యంలో టెండర్ నోటిఫికేషన్‌ను రద్దు చేసినట్లు భట్టి ప్రకటించారు. అయితే, టెండర్ల దాఖలుకు ఈ నెల 29 వరకు గడువు ఉన్నందువల్ల ధ్రువీకరణ పత్రం ఇవ్వడానికి ఇంకా తమకు సమయం ఉందని సింగరేణి అధికారులు చెబుతున్నారు.



## మౌని అమావాస్య పుణ్యస్నానాలు 4.5 కోట్లు !



మొదటి పేజి తరువాయి

తెల్లవారుజామునే పుణ్యస్నానాలు ఆచరిస్తున్న భక్తులపై హెలికాప్టర్ ద్వారా గులాబీ రేకుల వర్షం కురిపించారు. ఇటీవల మకర సంక్రాంతి సందర్భంగా సంగమంలో కోటి మందికి పైగా భక్తులు పుణ్యస్నానాలు చేయగా ఏకాదశి రోజున 85 లక్షల మంది పుణ్యస్నానాలు చేశారు. ''భిన్న మార్గాల నుంచి వస్తున్న భక్తులు నచ్చిన ఘాట్‌కు చేరుకునేందుకు వీలుగా మార్గసూచీలు ఏర్పాటుచేశాం.

భక్తులకు సాయపడేందుకు పెద్ద సంఖ్యలో పౌర వలంటీర్లను రంగంలోకి దించాం. మాఘ మేళా ప్రాంతమంతటా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లుచేశాం. 800 హెక్టార్లలో జరుగుతున్న మేళాను ఏడు సెక్టార్లుగా విభజించాం. 25,000 మరుగుదొడ్లను నిర్మించాం. శుభ్రతా కార్యక్రమాల కోసం 3,500 మంది సిబ్బంది పనిచేస్తున్నారు'' అని డివిజనల్ కమిషనర్ సౌమ్యా అగర్వాల్ చెప్పారు.

**కళకళలాడుతున్న టెంట్ సిటీ**

స్వల్పకాలిక కల్పవాస్ దీక్ష కోసం, మేళాను తిలకించేందుకు విచ్చేసే లక్షలాది మంది విదేశీ పర్యాటకులు, సందర్శకుల కోసం యూపీ సర్కారు ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. ''వారికోసం టెంట్ సిటీ నిర్మించాం. ధ్యానం, యోగాకు ప్రత్యేక ఏర్పాట్లు చేశాం. వృద్ధులు, అలసిపోయిన భక్తులు వెంటనే తిరుగుపయనం అయ్యేందుకు వీలుగా బైక్ ట్యాక్సీలు, గోల్ఫ్ కార్ట్ వాహనాలనూ సిద్ధంగా ఉంచాం'' అని సౌమ్య పేర్కొన్నారు.

''మేళాలో భద్రత, రక్షణ, పర్యవేక్షణ విధుల నిమిత్తం 10,000 మందికిపైగా పోలీస్ సిబ్బందిని మోహరించాం. జనం ఒకే ఘాట్‌లో గుమికూడకుండా చూసేందుకు, వాహనాలను వేర్వేరు చోట్ల నిలిపి ఉంచేందుకు 42 తాత్కాలిక పార్కింగ్ జోన్‌లను ఏర్పాటుచేశాం. ఒకేసారి 1,00,000 వాహనాలు వచ్చినా పార్కింగ్ చేసేలా పార్కింగ్ జోన్‌ల సామర్థ్యాన్ని పెంచాం'' అని మేళా సూపరింటెండెంట్ నీరజ్ పాండే వెల్లడించారు. ఈ ఏడాది మేళా కోసం 12 వేల అడుగుల పొడవునా స్నాన ఘాట్లను నిర్మించారు. కనీస సదుపాయాలన్నింటినీ సమీపంలోనే అందుబాటులో ఉంచారు.

## నేరాలను ప్రోత్సహించేలా సీఎం మాట్లాడటం సిగ్గుచేటు: కేటీఆర్



భారాస జెండా గద్దెలను ధ్వంసం చేయాలని హోంశాఖను కూడా పర్యవేక్షిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పిలుపునివ్వడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. "భారాస పదేళ్ల పాలనలో శాంతిభద్రతల విషయంలో దేశానికి తెలంగాణ ఆదర్శంగా నిలిచింది. కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో అరాచకపర్వానికి ద్వారాలు తెరిచింది. రాష్ట్ర ప్రజల్లో గులాబీ జెండాపై ఉన్న చెక్కు చెదరని అభిమానాన్ని చూసి సీఎంకు ఏం మాట్లాడాలో అర్థం కావడంలేదు. రెండేళ్ల పాలనలో పూర్తిగా కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైంది. సోషల్ మీడియాలో చిన్న పోస్టు పెడితేనే చురుగ్గా స్పందించి అరెస్టులు చేసే పోలీసులు.. సీఎం వ్యాఖ్యలపై తక్షణమే చర్యలు తీసుకోవాలి. భారాసను రాజకీయంగా ఎదుర్కోలేక భాజపాతో కాంగ్రెస్ చీకటి ఒప్పందాలు చేసుకుంది. రాష్ట్ర ప్రయోజనాలను పాతాళంలోకి నెట్టిన ముఖ్యమంత్రి భారీ మూల్యం చెల్లించుకోక తప్పదు" అని కేటీఆర్ విమర్శించారు.

# ఘనంగా గోదావరి పుష్కరాలు

మొదటి పేజి తరువాయి




**మంత్రిమండలిలో చర్చించిన ముఖ్యాంశాలివీ...**

వీలైనంత త్వరగా మున్సిపల్ ఎన్నికలకు వెళ్లాలని రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. ఫిబ్రవరిలో రంజాన్, శివరాత్రి పండగలు ఉన్నందున.. ఎన్నికల ప్రక్రియకు ఇబ్బంది లేకుండా షెడ్యూల్ రూపొందించుకోవాలని మంత్రివర్గం అధికారులకు సూచించింది.

హైదరాబాద్ మెట్రో రైల్ ఫేజ్ 1 ప్రాజెక్ట్‌ను ఎల్అండ్‌టీ నుంచి స్వాధీనం చేసుకునేందుకు సంబంధించి ఇంతవరకు జరిగిన పురోగతిని మంత్రివర్గం సమీక్షించింది. ఈ ప్రక్రియను వేగవంతం చేయాలని నిర్ణయం తీసుకుంది. మెట్రో ఫేజ్ 2ఎ లోని నాలుగు కారిడార్లు, ఫేజ్ 2బి లోని మూడు కారిడార్ల నిర్మాణానికి సంబంధించిన ప్రతిపాదనలు కేంద్ర ప్రభుత్వ ఆమోదం కోసం పెండింగ్‌లో ఉన్నాయి. ఈలోపు భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని నిర్ణయం తీసుకుంది. రూ.2,787 కోట్ల అంచనా వ్యయంతో భూసేకరణ ప్రతిపాదనలను మంత్రివర్గం ఆమోదించింది. యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టాలని ఆదేశించింది.

**కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంస్థలకు 14 ప్రాంతాల్లో భూముల కేటాయింపు.**

హైదరాబాద్ సమీపంలోని అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలో ఎకో టౌన్ అభివృద్ధి కోసం టీజీఐఐసీకి 494 ఎకరాల భూమిని కేటాయించేందుకు క్యాబినెట్ అనుమతి ఇచ్చింది.

హైదరాబాద్‌లో ట్రాఫిక్ సమస్యను అధిగమించేందుకు బంజారాహిల్స్‌లోని ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి శిల్పా లే అవుట్ రోడ్డు వరకు 9 కి.మీ. మేర కొత్త హైలెవల్ బ్రిడ్జి నిర్మాణానికి ఆమోదం తెలిపింది.

రామప్ప జలాశయంలోని గోదావరి జలాలను లక్నవరానికి.. అక్కడి నుంచి పైపులైన్ల ద్వారా జంపన్నవాగుకు తరలించడం కోసం రూ.35 కోట్ల మంజూరుకు ఆమోదించింది. తద్వారా జంపన్న వాగులో 365 రోజులూ నీళ్లుంటాయి. భవిష్యత్‌లో మేడారాన్ని తిరుమల, కుంభమేళాను మరిపించే విధంగా అభివృద్ధి చేయాలని క్యాబినెట్ నిర్ణయం తీసుకుంది.

నల్గొండ జిల్లా మహాత్మాగాంధీ యూనివర్సిటీ లా కాలేజీలో 24, ఫార్మసీ కాలేజీలో 28 కొత్త పోస్టుల మంజూరుకు; వీరనారి చాకలి ఐలమ్మ మహిళా యూనివర్సిటీలో రిజిస్ట్రార్ పోస్టుకు ఆమోదం తెలిపింది.

హ్యామ్ రోడ్లకు సంబంధించి.. ఆర్అండ్‌బీకి చెందిన 6 వేల కిలో మీటర్లకు పైగా రహదారులకు రూ.11,399 కోట్ల అంచనాతో టెండర్ల ప్రక్రియను వేగవంతం చేయాలని.. పంచాయతీరాజ్‌కు సంబంధించి రూ.6 వేల కోట్లతో పనులను త్వరగా ప్రారంభించాలని నిర్ణయం.

ములుగు జిల్లాలో కొత్తగా పొట్లాపూర్ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్‌ను క్యాబినెట్ ఆమోదించింది. రామప్ప చెరువు నుంచి నీటిని లిఫ్ట్ చేసి ములుగు జిల్లాలోని 5 గ్రామాలు, 30 చెరువులు, కుంటలను నింపడంతో పాటు.. 7,500 ఎకరాల ఆయకట్టుకు నీటిని అందించనుంది. రూ.143 కోట్ల అంచనా వ్యయంతో ఈ పథకం చేపట్టనుంది.

## మహా జంగిల్‌రాజ్‌ను అంతం చేస్తాం



నకిలీ పత్రాలతో బెంగాల్‌లో నివాసం ఉంటున్న అక్రమ వలసదారులను తరిమికొడతామని ఆయన హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా పశ్చిమ బెంగాల్‌లో రూ.830 కోట్లకు పైగా విలువైన అభివృద్ధి ప్రాజెక్టులతో పాటు ఢిల్లీ, వారాణసీ, చెన్నైలను కోల్‌కతాను అనుసంధానం చేసే మూడు అమృత్ భారత్ రైళ్లను ప్రధాని జెండా ఊపి ప్రారంభించారు. అస్సాంలోని కలియాబోర్‌లో మోదీ ప్రసంగిస్తూ అస్సాంలోకి పెద్దఎత్తున వచ్చిన చొరుబాటుదారులకు గత కాంగ్రెస్ ప్రభుత్వం ఇక్కడి భూములను అప్పగించిందని మండిపడ్డారు. ఓటు బ్యాంకు రాజకీయాల కోసం వారికి దశాబ్దాల తరబడి రాష్ట్రంలో ఆశ్రయం ఇచ్చిందని ఆరోపించారు. 'చొరుబాటుదారులు జనాభా సమతుల్యతను దెబ్బతీస్తున్నారు. సంస్కృతిపై దాడి చేస్తున్నారు. యువత ఉద్యోగాలను లాక్కుంటున్నారు. ఇది అస్సాంతో పాటు దేశ భద్రతకు తీవ్రముప్పుగా పరిణమించింది' అని మోదీ పేర్కొన్నారు. చొరుబాటుదారులపై కఠిన చర్యలు తీసుకోవడం ద్వారా బీజేపీ ప్రభుత్వం అస్సాం సంస్కృతిని కాపాడుతోందన్నారు. నాగావ్ జిల్లాలో రూ.6,957 కోట్లతో చేపట్టనున్న కాజీరంగా ఎలివేటెడ్ కారిడార్‌కు శంకుస్థాపన చేశారు.

# మేడారం జాతరకు ఆర్టీసీ టికెట్ రేట్లు ఖరారు..

మేడారం సమ్మక్క-సారక్క జాతరకు వెళ్లే భక్తుల కోసం తెలంగాణ ఆర్టీసీ కీలక నిర్ణయం తీసుకుంది. ప్రతి రెండేళ్లకోసారి జరిగే ఈ మహా జాతరకు రాష్ట్రం నలుమూలల నుంచి లక్షలాది మంది భక్తులు తరలివస్తారు. ఈ నేపథ్యంలో ప్రయాణికుల రద్దీని తగ్గించడంతో పాటు సౌకర్యవంతమైన ప్రయాణం కల్పించేందుకు ప్రత్యేక బస్సులు నడపాలని ఆర్టీసీ నిర్ణయించింది. ఇప్పటికే వివిధ ప్రాంతాల వేల సంఖ్యలో బస్సులను మేడారానికి తరలించగా.. తాజాగా దీనికి అనుగుణంగా వివిధ ప్రాంతాల నుంచి మేడారానికి వెళ్లే బస్సుల టిక్కెట్ చార్జీలను ఖరారు చేస్తూ శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. హైదరాబాద్, వరంగల్, హనుమకొండ, మహబూబాబాద్, భూపాలపల్లి, ఏటూరునాగారం, ఖమ్మం, గోదావరిఖని, కొత్తగూడెం వంటి ప్రాంతాల నుంచి మేడారానికి ప్రత్యేక సర్వీసులు అందుబాటులోకి తీసుకువచ్చింది. బస్సుల రకాన్ని బట్టి చార్జీలు నిర్ణయించారు. హైదరాబాద్ నుంచి ప్రయాణించే వారికి సూపర్ లగ్జరీ, రాజధాని, డీలక్స్, ఎక్స్‌ప్రెస్, సాధారణ, గరుడ ప్లస్ బస్సులు నడపనున్నారు. వీటికి టిక్కెట్ ధరలు రూ.600 నుంచి రూ.1,110 వరకు ఉంటాయి. అలాగే భూపాలపల్లి, ఖమ్మం, గోదావరిఖని, కొత్తగూడెం వంటి ప్రాంతాల నుంచి కూడా ప్రత్యేక సర్వీసులు అందుబాటులోకి రానున్నాయి. 'మహాలక్ష్మి' పథకం కింద మహిళలు, బాలికలు, ట్రాన్స్‌జెండర్లకు ఎక్స్‌ప్రెస్ బస్సుల్లోనూ ఉచిత ప్రయాణ సౌకర్యం కొనసాగుతుందని ఆర్టీసీ స్పష్టం చేసింది.

# మోదీ సర్కారుపై పోరుకు దండు కడదాం

**భాజపాతో బ్రిటిషర్ల అంతటి ప్రమాదం**

నాడు బ్రిటిషర్లతో ఎంత ప్రమాదం ఉండేదో.. నేడు భాజపాతో అంతే ప్రమాదముంది. భాజపా అంటే భారతీయ జనతా పార్టీ కాదు. అది బ్రిటిష్ జనతా పార్టీ. విభజించు.. పాలించు.. పేదవాళ్లను అణగదొక్కు అనే బ్రిటిషర్ల ఆలోచనతోనే మనల్ని అణచివేస్తోంది. నాడు నిరుపేదల కోసం కాంగ్రెస్, కమ్యూనిస్టులు కలిసి జాతీయ ఉపాధి హామీ పథకాన్ని తెచ్చారు. నేడు అదానీ, అంబానీలకు కూలీలు దొరకడంలేదు. అందుకే మోదీ ప్రభుత్వం 'ఉపాధి హామీ'ని నిర్వీర్యం చేసి రద్దు చేసింది. రైతుకూలీల హక్కులు కాపాడటంతో పాటు కార్పొరేట్ల దోపిడీ ఆగడమే కమ్యూనిస్టులు కోరుకునే నిజమైన స్వేచ్ఛ. అందుకే మీ పోరాటాలకు కాంగ్రెస్ అండగా నిలబడింది.

ఖమ్మంలోని ఎస్ఆర్‌బీజీఎన్ఆర్ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన సభకు హాజరైన కార్యకర్తలు, అభిమానులు



**పేదల ఓటుహక్కు తొలగించేందుకే ఎస్ఐఆర్**

రాజ్యాంగాన్ని సమూలంగా మార్చేందుకే మొన్నటి ఎన్నికల్లో భాజపా 400 సీట్లు అడిగింది. వారికి అన్ని సీట్లిస్తే రాజ్యాంగాన్ని మార్చేస్తారని.. రిజర్వేషన్లు రద్దు చేస్తారని రాహుల్‌గాంధీ ప్రతి గ్రామానికి వెళ్లి చెప్పారు. అందుకే భాజపా 240 సీట్ల దగ్గరే ఆగింది. కానీ నేడు మళ్లీ రాజ్యాంగాన్ని మార్చే ప్రయత్నంలో భాగంగానే ఎస్ఐఆర్‌ను తీసుకొచ్చింది. రాజ్యాంగాన్ని రాసిన సమయంలోనే గోల్వర్కర్ సిద్ధాంతం నమ్మినవారు పేదలకు ఓటుహక్కు ఉండొద్దన్నారు. కానీ గాంధీ, అంబేద్కర్‌లు వారికి ఓటుహక్కు కల్పించారు. నేడు వారిని భాజపా ఆధారాలు అడుగుతోంది. ఇక్కడే పుట్టి పెరిగిన ఆ జాతులు ఎక్కడినుంచి తీసుకొస్తాయి? ఇదే జరిగితే పేదల ఓటుహక్కు, రైతుకూలీల హక్కులు, రేషన్‌కార్డులు పోతాయి. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందవు.

**ఖమ్మంలో ఇద్దరు సర్పంచులనైనా గెలిపించలేరు**

నాటి సాయుధ రైతాంగ పోరాటానికి పుచ్చలపల్లి సుందరయ్య, చండ్ర రాజేశ్వరరావుతో పాటు ఈ ప్రాంతం నుంచి నల్లమల గిరిప్రసాద్, పువ్వాడ నాగేశ్వరరావులాంటి నేతలు ప్రాతినిధ్యం వహించారు. కమ్యూనిస్ట్‌లు బలమైన ఉద్యమాన్ని ఈ గడ్డపై చేపట్టినందుకే భాజపాకు స్థానం లేదు. మోదీ, అమిత్‌షాలు వచ్చినా ఖమ్మం జిల్లాలో ఇద్దరు సర్పంచులనైనా గెలిపించుకోలేరు. ఇప్పుడు ప్రమాదంలో ఉన్న పేదల హక్కులను కాపాడేందుకు కలిసికట్టుగా పనిచేయాల్సిన అవసరమొచ్చింది. అందుకే సీపీఐ ఆహ్వానం మేరకు ఈఉత్సవాల్లో పాల్గొన్నా. తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి రావడం వెనుక మీ శ్రమ ఉంది. రాబోయే వందేళ్లు పేదల కోసం మీరు కొట్లాడాలి'' అని రేవంత్ పేర్కొన్నారు.

## రాయదుర్గం కట్ట మైసమ్మ ఆలయంలో కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి ప్రత్యేక పూజలు

**గ్రామ దేవతలను పూజించడం తెలంగాణ సంస్కృతిలో భాగం : గచ్చిబౌలి కార్పొరేటర్**

ఈకబురు, శేరిలింగంపల్లి : శేరిలింగంపల్లి నియోజకవర్గం గచ్చిబౌలి డివిజన్ పరిధి లోని రాయిదుర్గంలో గల కట్ట మైసమ్మ ఆలయంలో ఆదివారం గచ్చిబౌలి డివిజన్ కార్పొరేటర్ వి. గంగాధర్ రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక బిజెపి నాయకులు, రాయదుర్గం గ్రామస్థులతో కలిసి కట్ట మైసమ్మ అమ్మవారి ఆలయాన్ని సందర్శించిన గంగాధర్ రెడ్డి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి మాట్లాడుతూ గచ్చిబౌలి డివిజన్ ప్రజలపై అమ్మవారి చల్లని చూపు ఉండాలని, ప్రజలు సుఖ సంతోషాలతో.. ఆరోగ్యాలతో ఉండేలా చూడాలని అమ్మవారిని వేడుకున్నానని తెలిపారు. గ్రామ దేవతలను పూజించడం తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలలో భాగమని అన్నారు. గచ్చిబౌలి డివిజన్ లో ఆలయాల అభివృద్ధికి ఎల్లప్పుడూ ముందుంటానని తెలిపారు. ఈ కార్యక్రమంలో గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని బీజేపీ రాష్ట్ర నాయకులు, జిల్లా నాయకులు, డివిజన్ నాయకులు, కార్యకర్తలు, స్థానికులు పాల్గొన్నారు.



కట్ట మైసమ్మ ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి

## యువత ఆరోగ్యంగా ఉంటేనే దేశం అభివృద్ధి : కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి


సైకిల్ రైడ్ లో పాల్గొని సైకిల్ తొక్కుతున్న కేంద్రమంత్రి కిషన్ రెడ్డి తదితరులు


సైకిల్ రైడ్ లో ఆకట్టుకున్న విన్యాసాలు

ఈకబురు, శేరిలింగంపల్లి : శక్తివంతమైన యువత భారత్ సొంతమని, యువత ఆరోగ్యంగా ఉంటేనే దేశ అభివృద్ధి... ఆరోగ్య భారత్ నిర్మాణం సాధ్యమని కేంద్ర బొగ్గు, గనుల శాఖమంత్రి జి.కిషన్ రెడ్డి అన్నారు. కేంద్ర ప్రభుత్వ కార్యక్రమం ఫిట్ ఇండియాలో భాగంగా గచ్చిబౌలిలోని జీఎంసీ బాలయోగి స్టేడియంలో ఆదివారం సండేస్ ఆన్ సైకిల్ 57వ ఎడిషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బాడ్మింటన్ కోచ్ పుల్లెల గోపిచంద్ తో కలిసి కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సైకిల్ రైడ్ ను జెండా ఊపి ప్రారంభించిన అనంతరం కిషన్ రెడ్డి స్వయంగా సైకిల్ రైడ్ లో పాల్గొని సైకిల్ తొక్కారు. అనంతరం కిషన్ రెడ్డి మాట్లాడుతూ ఫిట్ ఇండియా లక్ష్యంగా ప్రధానమంత్రి నరేంద్రమోడీ నేతృత్వంలో కేంద్ర ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. నేడు ప్రజల జీవన విధానంలో వచ్చిన మార్పులు, ఆహారపు అలవాట్లు, వాతావరణ మార్పులు, శారీరక శ్రమ లేకపోవడంతో రకరకాల అనారోగ్యాలకు, ఒబెసిటీకి గురవుతున్నారని అన్నారు. ముఖ్యంగా నేటి యువత ఎక్కువగా ఓబెసిటీ బారిన పడుతున్నారని, ఓబెసిటీని తగ్గించేందుకు కేంద్ర ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపడుతుందన్నారు. మానసిక ఒత్తిడి సైతం అనేక ఆరోగ్య సమస్యలకు కారణంగా మారుతుందని తెలిపారు. తన చిన్నతనంలో ఎవ్వరి పనులు వారే చేసుకునే వారని, కానీ నేడు పరిస్థితి పూర్తిగా మారిందన్నారు. మారిన కాలానికి, పెరిగిన టెక్నాలజీతో పనిభారం తగ్గిందని, దీని కారణంగా త్వరగా అనారోగ్యానికి గురవుతున్నారని అన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని ఫిట్ ఇండియా కార్యక్రమం ద్వారా ఆరోగ్య భారత్ కోసం ప్రధాని మోడీ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. యువత ఆరోగ్యవంతంగా ఉంటేనే దేశానికి సేవ చేసే అవకాశం లభిస్తుందని, దేశం అభివృద్ధి పథంలో ముందుకు సాగుతుందన్నారు. ఆరోగ్యవంతమైన యువత, వారి మేధస్సే దేశ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. సైకిల్ రైడ్ సందర్భంగా ప్రదర్శించిన పలు విన్యాసాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో సైబరాబాద్ కమీషనర్ డాక్టర్ ఎం. రమేష్ తో పాటు పలువురు క్రీడా ప్రముఖులు, అధికారులు, క్రీడాకారులు పాల్గొన్నారు.


సమావేశంలో ప్రసంగిస్తున్న దృశ్యం

## అపర్ణ క్యాన్సర్ క్రూసేడర్స్ గోల్ఫ్ ఛాంపియన్ షిప్ ను
# ప్రారంభించిన జగపతిబాబు, సంయుక్త మీనన్


క్యాన్సర్ బారిన పడిన చిన్నారితో నటులు జగపతిబాబు, సంయుక్త మీనన్ తదితరులు


గోల్ఫ్ అడుతున్న నటుడు జగపతిబాబు, నటి సంయుక్త మీనన్

**క్యాన్సర్ తో పోరాడుతున్న పేదవారికి ఆశాదీపంగా క్యూర్ ఫౌండేషన్ : నటుడు జగపతిబాబు**

**నిజమైన విజయం సమాజానికి తిరిగి ఇవ్వడంలోనే ఉంది : నటి సంయుక్త మీనన్**

ఈకబురు, శేరిలింగంపల్లి : క్యాన్సర్ బారిన పడి, చికిత్సకు డబ్బులు చెల్లించలేక ఆర్థిక ఇబ్బందులు పడుతున్న వారికి అండగా నిలిచేందుకు, క్యాన్సర్ పై సమాజంలో అవగాహన కల్పించే లక్ష్యంతో నిర్వహించే 9వ ద్వైవార్షిక అవర్ణా క్యాన్సర్ క్రూసేడర్స్ గోల్ఫ్ ఛాంపియన్ షిప్ పోటీలను ఆదివారం గచ్చిబౌలిలో ప్రముఖ నటుడు జగపతిబాబు, నటి సంయుక్త మీనన్ లు ముఖ్యఅతిథులుగా హాజరై అధికారికంగా ప్రారంభించారు. గచ్చిబౌలిలోని బౌల్డర్ హిల్స్ లో క్యూర్ ఫౌండేషన్, అపోలో క్యాన్సర్ సెంటర్ల ఆధ్వర్యంలో జనవరి 30వ తేదీ నుంచి ఫిబ్రవరి 1వ తేదీ వరకు ఈ పోటీలు కొనసాగనున్నాయి. మూడు రోజుల పాటు కొనసాగనున్న ఈ పోటీల్లో 450 మంది గోల్ఫర్లు, కార్పొరేట్ నేతలు, ప్రముఖులు పాల్గొనసున్నారు. ఈ ఛాంపియన్ షిప్ క్యాన్సర్ బాధితులకు నిధులు సమీకరించడంతో పాటు సమాజంలో క్యాన్సర్ వ్యాధిపై అవగాహన కల్పించనున్నారు. ఈ ఛాంపియన్ షిప్ ను స్టేబుల్ ఫోర్డ్ ఫార్మాట్లో, 100 శాతం హ్యాండిక్యాప్ విధానంలో నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా క్యూర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ విజయ్ ఆనంద్ రెడ్డి మాట్లాడుతూ క్యూర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇప్పటి వరకు 1500మందికి పైగా క్యాన్సర్ బాధితులకు ఉచితంగా, సబ్సిడీతో క్యాన్సర్ చికిత్స అందించినట్లు తెలిపారు. చిన్నారులకు ఉచితంగా క్యాన్సర్ చికిత్స అందించడం క్యూర్ ఫౌండేషన్ లక్ష్యాల్లో ఒకటని తెలిపారు. సరైన సమయంలో చికిత్స అందితే క్యాన్సర్ బారిన పడిన చిన్నారులను రక్షించవచ్చన్నారు. ఖరీదైన క్యాన్సర్ చికిత్సను భరించలేని ఆర్థికంగా వెనుక బడిన చిన్నారులను ఆదుకునేందుకు నిధుల సేకరణ కోసం ఈ ద్వైవార్షిక ఛాంపియన్షిప్ గోల్ఫ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నటుడు జగపతిబాబు మాట్లాడుతూ ఆర్థిక స్తోమత లేక క్యాన్సర్ బారిన పడిన వారికి క్యూర్ ఫౌండేషన్ ఆశాదీపంగా కనిపిస్తుందన్నారు. మనమంతా ఒక సమూహంగా మారినప్పుడు ఈ ప్రపంచాన్ని మంచి నివాసంగా మార్చవచ్చని అన్నారు. నటి సంయుక్త మీనన్ మాట్లాడుతూ సంక్రాంతి సందర్భంగా విడుదలైన తన సినిమా మంచి విజయాన్ని సాధించిందని, నిజమైన విజయం సమాజానికి తిరిగి ఇవ్వడంలోనే ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రైడ్ మోటార్స్ మేనేజింగ్ డైరెక్టర్ సురేష్ రెడ్డి, అవర్గా ఎంటర్ ప్రైజెస్ ఇండిపెండెంట్ డైరెక్టర్ అభయ శంకర్, ఎమ్మార్ ప్రాపర్టీస్ సీఎఫ్ఎ ఎన్ఆర్ఎన్.రెడ్డి, హెచ్ఎస్సి జనరల్ మేనేజర్ రుబిన్ చెరియాన్ తదితరులు పాల్గొన్నారు.


గోల్ఫ్ అడుతున్న నటుడు జగపతిబాబు, నటి సంయుక్త మీనన్

## అమీన్ పూర్ పెద్ద చెరువులో
# అక్రమ నీటి వ్యాపార జలగలు


అమీన్ పూర్ పెద్ద చెరువు ఎఫ్టీఎల్ పరిధిలో కొనసాగుతున్న అక్రమ బోర్లు, నీటి ట్యాంకులు


అమీన్ పూర్ పెద్ద చెరువు ఎఫ్టీఎల్ పరిధిలో కొనసాగుతున్న అక్రమ బోర్లు, నీటి ట్యాంకులు

**చెరువు నీళ్లే పెట్టుబడిగా చెలరేగుతున్న నీటి వ్యాపారులు**

**ఎఫ్టీఎల్, బఫర్ జోన్లలో బోర్లు వేసి నీటిని తోడుతున్న వైనం**

ఈకబురు, పఠాన్ చెరు : మనిషి శరీరాన్ని పట్టే జలగ రక్తం మొత్తం పీల్చినట్టు.. చెరువుల మీద వాలుతున్న అక్రమ నీటి వ్యాపారులు చెరువు నీటిని ఖాళీ చేస్తున్నారు. నయా పైసా ఖర్చు లేకుండా అక్రమ నీటి వ్యాపారంతో కోట్లు గడిస్తున్నారు. నగరంలో అక్రమ నీటి వ్యాపారం మూడు బోర్లు, ఆరు ట్యాంకర్లుగా వెలుగొందుతుంది. ఎండాకాలం ప్రారంభం అవుతుందంటే చాలు అక్రమ నీటి వ్యాపారులు నగర శివారులో చెలరేగిపోతున్నారు. చెరువుల చుట్టూ బోర్లు వేసి, భారీ మోటార్లతో నీటిని తోడుతూ.. రోజుకు వందల ట్యాంకర్లను విక్రయిస్తున్నారు. వీరి నీటి వ్యాపారం కారణంగా చుట్టుపక్కల ఇళ్లలో ఉన్న బోర్లు ఎండిపోయి ప్రజలు నీటి కొరతతో ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా అమీన్ పూర్ పెద్ద చెరువులో అక్రమ నీటి వ్యాపారులు పెద్ద ఎత్తున తిష్ట వేశారు. వాల్టా చట్టం ప్రకారం అక్రమంగా బోరు వేసినా, నీటి వ్యాపారం చేసినా శిక్ష తప్పదు. కానీ అక్రమ నీటి వ్యాపారులు రాజకీయ పలుకుబడి, అధికారుల అండదండలతో ఏకంగా చెరువుల్లోనే బోర్లు వేసి నీటి వ్యాపారం నిర్వహిస్తున్నారు.

**బోరు వేసి.. కృత్రిమ ట్యాంక్ సిద్ధం చేసి...**

అమీన్ పూర్ పెద్ద చెరువు చుట్టూ ఎఫ్టీఎల్, బఫర్ జోన్లలో బోర్లు వేస్తున్న అక్రమ నీటి వ్యాపారులు ఓ గుంత తవ్వి, టార్పాలిన్ కవర్లతో తాత్కాలిక ట్యాంక్ ను ఏర్పాటు చేసుకుంటున్నారు. వేసిన బోర్లకు భారీ మోటర్లను బిగించి, 24 గంటల పాటు యథేచ్ఛగా నీటిని తోడుతూ ట్యాంకులు నింపుతున్నారు. అవే ట్యాంకుల నీటిని భారీ ట్యాంకర్లతో తరలిస్తున్నారు. చెరువు పక్కనే ఉన్న బోర్లు కావడంతో నిరంతరం నీటిని తోడుతూ, రోజుకు వందల ట్యాంకర్లతో తరలించి విక్రయిస్తున్నారు. పరిసర ప్రాంతాలైన బాచుపల్లి, మియాపూర్, చందానగర్ ప్రాంతాల్లో ట్యాంకర్ల ద్వారా ఈ నీటిని అమ్ముతూ సొమ్ము చేసుకుంటున్నారు.

**కోట్లలో వ్యాపారం...**

చూసేందుకు నీటి వ్యాపారంగా కనిపిస్తున్నా, రోజుకు కోట్ల రూపాయల లావాదేవీలు జరుగుతున్నాయనేది జగమెరిగిన సత్యం. పరిసర ప్రాంతాల్లోని హోటళ్లు, వాణిజ్య సముదాయాలు, నీటి ఎద్దడి ఉన్న ప్రాంతాలు, భారీ అపార్టుమెంట్లకు ట్యాంకర్లను సరఫరా చేస్తున్నారు. ఒక్కో ట్యాంకర్ ను 1200 రూపాయల నుంచి 5వేల రూపాయల వరకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. చెరువు ఎఫ్టీఎల్, బఫర్ జోన్లలో బోర్లు వేయడం నిషిద్ధమైనా, స్థానిక రెవెన్యూ, జిహెచ్ఎంసి అధికారులకు నెలవారి మామూళ్లు చెల్లిస్తూ, అడ్డుఅదుపు లేకుండా అక్రమ నీటి వ్యాపారం సాగిస్తున్నారని తెలుస్తోంది. అమీన్ పూర్ పెద్ద చెరువు చుట్టూ సుమారు 15 బోర్లు వేసి నీటి వ్యాపారం చేసినట్లు తెలుస్తుంది. భారీ వాటర్ ట్యాంకర్లు నాన్ స్టాప్ గా తిరుగుతుండడంతో శ్రీవాణి నగర్ లో రోడ్లు గుంతలు పడుతున్నాయని స్థానికుల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాగా చెరువు చుట్టూ ఉన్న కాలనీవాసుల ఫిర్యాదులతో అక్రమ బోర్లను పరిశీలించేందుకు వెళ్లిన రెవెన్యూ, జీహెచ్ఎంసీ అధికారులతో నీటి వ్యాపారులు వాగ్వాదానికి దిగడం చూస్తే అక్రమ నీటి వ్యాపారులు ఎంతగా చెలరేగిపోతున్నారో అర్థం అవుతుంది. హైడ్రా అధికారులు పట్టించుకుని అమీన్ పూర్ పెద్ద చెరువు లో అక్రమంగా వేసిన బోర్లపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

## గ్రీన్‌లాండ్ సుంకం' ఘోర తప్పిదం

తమ దేశ భద్రత విషయంలో గ్రీన్‌లాండ్ ఎంతో ముఖ్యమని, దాన్ని స్వాధీనం చేసుకుంటామని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పదేపదే చెబుతున్నారు. ఈ ప్రాంతం డెన్మార్క్ నియంత్రణలో ఉంది. ఈ నేపథ్యంలో ఐరోపా దేశాలు డెన్మార్క్‌కు మద్దతుగా నిలిచాయి. గ్రీన్‌లాండ్ భద్రత నాటో ఉమ్మడి బాధ్యతని పేర్కొన్నాయి. ఈ క్రమంలోనే ఫ్రాన్స్, జర్మనీ, స్వీడన్, నార్వే, ఫిన్లాండ్, నెదర్లాండ్స్, బ్రిటన్‌లు అక్కడికి బలగాలను తరలించాయి. ఈ పరిణామాల నడుమే డెన్మార్క్‌తోపాటు ఈ 7 దేశాలపై ట్రంప్ 10 శాతం అదనపు సుంకాలను ప్రకటించారు. ఇవి ఫిబ్రవరి 1 నుంచి అమల్లోకి వస్తాయని తెలిపారు. అప్పటికీ దిగిరాకపోతే జూన్ నుంచి ఆ సుంకాలను 25శాతానికి పెంచుతామని హెచ్చరించారు. ఈ నేపథ్యంలో బ్రిటన్‌సహా ఈయూ దేశాలు స్పందించాయి.

'నాటో సభ్య దేశాలుగా గ్రీన్‌లాండ్ భద్రత కోసం చర్యలు తీసుకుంటే సుంకాలు విధిస్తామని హెచ్చరించడం పూర్తిగా తప్పు. ఈ విషయాన్ని నేరుగా అమెరికా యంత్రాంగంతో తేల్చుకుంటాం' అని కీర్ స్టార్మర్ పేర్కొన్నారు. గ్రీన్‌లాండ్ ఎప్పటికీ డెన్మార్క్‌లో భాగమేనని స్పష్టం చేశారు. 'సుంకాల బెదిరింపులు ఆమోదయోగ్యం కాదు. ఏ బెదిరింపులకు లొంగేది లేదు' అని మెక్రాన్ వ్యాఖ్యానించారు. ఐరోపా దేశాలన్నీ తగిన సమాధానం ఇస్తాయని స్పష్టం చేశారు. మిత్ర దేశాల మధ్య విభేదాలతో రష్యా, చైనాలకే ప్రయోజనం కలుగుతుందని ఈయూ విదేశాంగ విధాన చీఫ్ కాజా కల్లాస్ పేర్కొన్నారు.

**తమను బ్లాక్ మెయిల్ చేయలేరంటూ స్వీడన్ ప్రధాని ఉల్ఫ్ క్రిస్టెర్సన్ స్పష్టం చేశారు.**

అంతర్జాతీయ చట్టాన్ని కాపాడుకునే విషయంలో ఈయూ ఎల్లప్పుడూ దృఢంగా ఉంటుందని యూరోపియన్ కౌన్సిల్ అధ్యక్షుడు ఆంటోనియో కోస్టా స్పష్టం చేశారు.

ట్రంప్ ప్రకటన ఆశ్చర్యకరమని డెన్మార్క్ విదేశాంగ మంత్రి రాస్‌మ్యూసెన్ తెలిపారు.

మిత్రుల మధ్య హెచ్చరికలు సరికావని నార్వే ప్రధాని జోనాస్ గర్ స్టోర్ వ్యాఖ్యానించారు.

చర్చల ద్వారా మిత్రుల మధ్య సమస్యలను పరిష్కరించుకోవాలని ఫిన్లాండ్ అధ్యక్షుడు అలెగ్జాండర్ స్టబ్ అభిప్రాయపడ్డారు.



## 2025లో 24% పెరిగిన వాహన ఎగుమతులు



**దిల్లీ: విదేశీ విపణిల్లో కార్లు, ద్విచక్ర, వాణిజ్య వాహనాలకు గిరాకీ పెరగడంతో.. 2025లో మనదేశం నుంచి 63,25,211 వాహనాలు ఎగుమతి అయ్యాయని వాహన తయారీదార్ల సంఘం సియామ్ తెలిపింది. 2024లో ఎగుమతి అయిన 50,98,474 వాహనాలతో పోలిస్తే ఇవి 24.1% అధికం. పశ్చిమాసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికా దేశాల నుంచి మన వాహనాలకు గిరాకీ స్థిరంగా లభిస్తోందని వెల్లడించింది.**

**మోటార్ సైకిల్ ఎగుమతులు 27% పెరిగి 43,01,927కు చేరాయి. స్కూటర్ల ఎగుమతులు 8% వృద్ధితో 6,20,241గా నమోదయ్యాయి. మొత్తం వాణిజ్య వాహనాల ఎగుమతులు 27% పెరిగి 91,759కి చేరాయి.**

**ప్రయాణికుల వాహనాలు (పీవీ- కార్లు, ఎస్‌యూవీలు, ఎంపీవీ) 2024లో 7,43,979 ఎగుమతి కాగా, 2025లో 16% వృద్ధితో 8,63,233కు చేరాయి. మారుతీ సుజుకీ 2024లో 3.26 లక్షల వాహనాలు ఎగుమతి చేయగా.. 2025లో ఈ సంఖ్య 3.95 లక్షలకు చేరింది. మొత్తం ప్రయాణికుల వాహనాల ఎగుమతుల్లో 46% వాటా ఎంఎస్ఐ దే అని సంస్థ సీనియర్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ రాహుల్ భారతి వివరించారు.**

# ఊహించనంతగా పెరుగుతున్న బంగారం.. కారణమెవరు?

బంగారం ధరలు రోజు రోజుకి అమాంతం పెరిగిపోతూ ఉన్నాయి. ధరల పెరుగుదల చాలామంది పసిడి ప్రియులలో నిరాశను కలిగిస్తున్నాయి. ఇంతకీ గోల్డ్ రేటును ఎవరు నిర్ణయిస్తారనేది చాలామంది తెలుసుకోవాలనుకునే విషయం. ఈ కథనంలో పసిడి ధరలను నిర్ణయించడంలో అంతర్జాతీయ మార్కెట్ల ప్రభావం ఎంత వరకు ఉంటుంది?, మన దేశంలో గోల్డ్ రేటును ఏఏ అంశాలు ప్రభావితం చేస్తాయనే విషయాలను తెలుసుకుందాం.

బంగారం ధరలను ప్రభావితం చేసే అంతర్జాతీయ అంశాలు

ఎల్‌బీఎంఏ ఫిక్సింగ్: ఎలక్ట్రానిక్ వేలం ప్రక్రియ ద్వారా ఎల్‌బీఎంఏ (లండన్ బులియన్ మార్కెట్ అసోసియేషన్) రోజుకు రెండుసార్లు బెంచ్‌మార్క్ బంగారం ధరలను నిర్ణయిస్తుంది. ఈ ధరలు ప్రపంచ వాణిజ్యం, పెట్టుబడులకు రిఫరెన్స్ పాయింట్‌గా పని చేస్తాయి.

గోల్డ్ ఫ్యూచర్స్ & ట్రేడింగ్ మార్కెట్లు: కమోడిటీ ఎక్స్చేంజీకామెక్స్ (న్యూయార్క్), షాంఘై గోల్డ్ ఎక్స్చేంజ్ (ఎస్‌జీఈ), మల్టీ కామోడిటీ ఎక్స్చేంజీఎంసీఎక్స్ (ఇండియా) వంటి ప్రధాన ఫైనాన్షియల్ ఎక్స్చేంజీలు బంగారం ధరలను నిర్ణయించడంలో కీలక పాత్ర పోషిస్తాయి. ట్రేడింగ్ యాక్టివిటీ, ఇన్వెస్టర్ల సెంటిమెంట్, స్పెక్యులేషన్ ఆధారంగా నేరుగా ధరల కదలికలను ప్రభావితం చేస్తాయి.

సెంట్రల్ బ్యాంక్ రిజర్వ్స్ & మానిటరీ పాలసీ: రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ), యూఎస్ ఫెడరల్ రిజర్వ్ (ఫెడ్), యూరోపియన్ సెంట్రల్ బ్యాంక్ (ఈసీబీ)తో సహా కేంద్ర బ్యాంకులు గణనీయమైన బంగారు నిల్వలను కలిగి ఉన్నాయి. వారి క్రయవిక్రయాలు ప్రపంచవ్యాప్తంగా బంగారం ధరలను ప్రభావితం చేస్తాయి.

ద్రవ్యోల్బణం & ఆర్థిక అనిశ్చితి: బంగారం తరచుగా ద్రవ్యోల్బణం, ఆర్థిక తిరోగమనానికి వ్యతిరేకంగా రక్షణ కవచంగా ఉపయోగించబడుతుంది. ప్రపంచ మార్కెట్లు మాంద్యం, వాణిజ్య వివాదాలు లేదా భౌగోళిక రాజకీయ సంఘర్షణలు వంటి అనిశ్చితిని ఎదుర్కొన్నప్పుడు బంగారం ధరలు పెరుగుతాయి.

మన దేశంలో బంగారం ధరలను ప్రభావితం అంశాలు

దిగుమతి సుంకాలు, ప్రభుత్వ నిబంధనలు: భారతదేశంలో బంగారం దిగుమతులపై ఆధారపడుతుంది. ప్రభుత్వం కస్టమ్ సుంకాలు పసిడి ధరను నిర్ణయిస్తాయి. ఇది స్థానిక ధరలను నేరుగా ప్రభావితం చేస్తుంది. పన్ను విధానాల్లో మార్పులు బంగారాన్ని మరింత ఖరీదైనవి లేదా సరసమైనవిగా మారుస్తాయి.

కరెన్సీ మారకం రేట్లు: బంగారం అమెరికా డాలర్లలో ట్రేడ్ అవుతుంది కాబట్టి, భారత రూపాయి మారకం రేటులో హెచ్చుతగ్గులు దేశీయ పసిడి ధరలను ప్రభావితం చేస్తాయి. రూపాయి బలహీనపడితే భారతీయ కొనుగోలుదారులకు బంగారం ఖరీదుగా మారుతుంది.

పండుగలు, వివాహాలు: దేశంలో బంగారం పట్ల బలమైన సాంస్కృతిక అనుబంధం ఉంది. ముఖ్యంగా దీపావళి, అక్షయ తృతీయ వంటి పండుగలు, వివాహ సీజన్లలో దీన్ని అధికంగా కొనుగోలు చేస్తారు. ఈ సమయంలో డిమాండ్ పెరగడం వల్ల ధరలు పెరుగుతాయి.

దేశీయ సరఫరా, మార్కెట్ ధోరణి: బంగారం స్థానిక లభ్యత, ఆభరణాల రూపకల్పనలో వినియోగదారుల ప్రాధాన్యతలు, బంగారు పెట్టుబడి ఉత్పత్తుల లో ఆవిష్కరణలు (ఈటీఎఫ్‌లు, డిజిటల్ బంగారం మొదలైనవి) వివిధ ప్రాంతాల్లో ధరల వ్యత్యాసాలను ప్రభావితం చేస్తాయి.

ఐబీజేఏ: ఐబీజేఏ (ఇండియన్ బులియన్ జ్యువెల్లర్స్ అసోసియేషన్) గ్లోబల్ బెంచ్‌మార్క్‌లు, దేశీయ మార్కెట్ పరిస్థితుల ఆధారంగా రోజువారీ ధరల మార్గదర్శకత్వాన్ని అందిస్తుంది. రిటైల్ బంగారం ధరలో స్థిరత్వాన్ని నిర్ధారిస్తుంది.గోల్డ్ రేటును ఒక వ్యక్తి లేదా ఒక సంస్థ మాత్రమే నిర్ణయించదు. ఇది అంతర్జాతీయ మరియు దేశీయ కారకాల కలయికతో నిర్ణయించబడుతుంది. కాబట్టి బంగారం ధరలు ఎప్పుడూ స్థిరంగా ఉండవు. అవి ఆర్థిక విధానాలు, ప్రపంచ ఆర్థిక ధోరణులు, వినియోగదారుల ప్రవర్తనల కారణంగా మారుతాయి. అంతర్జాతీయ, దేశీయ కారకాలను అర్థం చేసుకోవడం ద్వారా పెట్టుబడిదారులు, కొనుగోలుదారులు బంగారాన్ని ఎప్పుడు కొనాలి.. ఎప్పుడు అమ్మాలి లేదా పెట్టుబడి పెట్టాలి అనే దానిపై నిపుణులు సలహాతో నిర్ణయాలు తీసుకోవచ్చు.



# సూచీల స్థిరీకరణకు అవకాశం!




**బడ్జెట్‌పై మదుపర్లు దృష్టిపెట్టొచ్చు**
**కార్పొరేట్ ఫలితాలూ కీలకమే**
**ఐటీ, లోహ, సిమెంటు షేర్లు రాణించొచ్చు**

దేశీయ సూచీలు ఈ వారంలో స్థిరీకరించుకోవచ్చని, సెంటిమెంట్ బలహీనంగానే కొనసాగొచ్చని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. 2026 27 బడ్జెట్ ప్రతిపాదనలు ఫిబ్రవరి 1న వెలువడనుండటంతో, మదుపర్లు దానిపై దృష్టిపెట్టొచ్చు. భారత్‌అమెరికా వాణిజ్య ఒప్పంద పరిణామాలు, కార్పొరేట్ సంస్థల మూడో త్రైమాసిక ఫలితాల నుంచి సంకేతాలు తీసుకోవచ్చు. గత వారం మార్కెట్లు ముగిశాక రిలయన్స్ ఇండస్ట్రీస్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్ ఫలితాలు వెలువడ్డాయి. ఆయా షేర్లపై ఫలితాల ప్రభావం సోమవారం (నేడు) ఉండొచ్చు. ఈ వారం నిఫ్టీ 50 సూచీకి 25,835 పాయింట్ల వద్ద నిరోధం, 25550 25600 శ్రేణిలో మద్దతు లభించొచ్చని సాంకేతిక నిపుణులు అంచనా వేస్తున్నారు. ఈ నెలలో ఇప్పటివరకు విదేశీ పోర్ట్‌ఫోలియో మదుపర్లు (ఎఫ్‌పీఐ) రూ.22,530 కోట్ల పెట్టుబడులు ఉపసంహరించుకున్నారు. వివిధ రంగాలపై విశ్లేషకులు అంచనా ఇలా..

నిఫ్టీ బ్యాంక్ సూచీకి హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్ ఫలితాలు దిశానిర్దేశం చేయనున్నాయి. ఈ సూచీ 59,500 పాయింట్ల ఎగువన ఉన్నంత వరకు, లాభాలు కొనసాగించొచ్చు. 60,800 పాయింట్ల వరకు వెళ్లే అవకాశం ఉంది.

ఐటీ షేర్లకు సానుకూలతలు కొనసాగే అవకాశం ఉంది. ఫలితాల నేపథ్యంలో షేరు ఆధారిత కదలికలు చోటుచేసుకోవచ్చు. కంపెనీల యాజమాన్యాల వ్యాఖ్యలపై దృష్టి పెట్టొచ్చు. ఈ వారం ఎల్‌టీఐ మైండ్‌ట్రీ, పర్సిస్టెంట్, ఎంఫసిస్, సైయెంట్ ఫలితాలు వెలువడనున్నాయి.

గిరాకీ పుంజుకునే సంకేతాలు కనిపిస్తుండటం, పలు బ్రోకరేజీలు సానుకూల అంచనాలు ఇవ్వడంతో సిమెంటు రంగ షేర్లు రాణించొచ్చు. పలు ప్రాంతాల్లో ధరలు మెరుగుపడటం కలిసిరావొచ్చు.

ఎఫ్‌ఎమ్‌సీజీ కంపెనీల షేర్లు నష్టాలను కొనసాగించొచ్చు. ఐటీసీ షేరు బలహీనంగా కనిపిస్తోంది. నిఫ్టీ ఎఫ్‌ఎమ్‌సీజీ సూచీకి 50,600 51000 మధ్య మద్దతు, 53,200 స్థాయిలో నిరోధం ఎదురుకావొచ్చు. హెచ్‌యూఎల్ షేర్లకు మదుపర్లు మొగ్గుచూపొచ్చు.

డిసెంబరు త్రైమాసిక ఫలితాల నేపథ్యంలో యంత్రపరికరాల రంగంలో షేరు ఆధారిత కదలికలు ఉంటాయి. భెల్ (సోమవారం), సుప్రీం ఇండస్ట్రీస్, కీ ఇండస్ట్రీస్ (బుధవారం) ఫలితాలు వెలువడనున్నాయి.

టెలికాం కంపెనీల షేర్లు స్వల్పకాలంలో ఒక శ్రేణిలో కదలాడొచ్చు. ఈ కంపెనీల త్రైమాసిక ఫలితాలు కీలకం కానున్నాయి. వొడాఫోన్ ఐడియా బకాయిలకు సంబంధించిన వార్తలు, రిలయన్స్ జియో ఐపీఓ వార్తలను గమనించాలి.

ఇరాన్ ఉద్రిక్తతల వల్ల భౌగోళిక అనిశ్చితులు పెరగడంతో, చమురుగ్యాస్ కంపెనీల షేర్లు పరిమిత శ్రేణిలో కదలాడొచ్చు. నిఫ్టీ ఆయిల్‌గ్యాస్ సూచీకి 11,340 11,400 వద్ద మద్దతు, 12,000 12,100 వద్ద నిరోధం కనిపిస్తోంది.

వాహన కంపెనీల షేర్లు డీలాపడొచ్చు. వరుసగా రెండో వారం నష్టపోయిన నిఫ్టీ వాహన సూచీ, స్వల్పకాలంలో అదే ధోరణిలో సాగొచ్చు.

త్రైమాసిక ఫలితాల కారణంగా ఔషధ కంపెనీల షేర్లు ఒక శ్రేణికి లోబడి ట్రేడవవచ్చు. సరఫరా ఇబ్బందుల నేపథ్యంలో సిప్లా షేరు ఒడుదొడుకులు ఎదుర్కోవచ్చు. ఎంపిక చేసిన కొన్ని షేర్లు కాస్త పెరగొచ్చు. ఏడాదికి పైగా స్థిరీకరణలో ఉన్న నిఫ్టీ ఫార్మా సూచీ ఈ వారమూ అదే ధోరణిని కొనసాగించొచ్చు.

లోహ, గనుల కంపెనీల షేర్లు ఈ వారం మెరిసే అవకాశం ఉంది. సరఫరా ఇబ్బందులు, అంతర్జాతీయ విధాన అనిశ్చితుల కారణంగా ప్రాథమిక లోహ ధరలు దూసుకెళ్తుండటమే ఇందుకు కారణం. నిఫ్టీ లోహ సూచీకి 11050 11300 శ్రేణిలో మద్దతు, 12000 పాయింట్ల వద్ద నిరోధం ఎదురుకావొచ్చు.

## ఏళ్ల తర్వాత పట్టణ సహకార బ్యాంకులకు లైసెన్స్ ఇవ్వనున్న ఆర్‌బీఐ



**20 ఏళ్లకు పైగా విరామం తర్వాత, పట్టణ సహకార బ్యాంకుల (యూసీబీలు)కు లైసెన్సుల జారీని తిరిగి ప్రారంభించాలని భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) ప్రతిపాదించింది. కొత్త యూసీబీలు ఆర్థికంగా విఫలమవడంతో 2004లో లైసెన్సుల జారీని నిలిపివేశారు. ప్రస్తుతం వీటిని కనీసం రూ. 300 కోట్ల మూలధనంతో సహా కఠినమైన నిబంధనలతో కొత్త లైసెన్సులను మళ్లీ అనుమతించాలని భావిస్తోంది. దీనికి సంబంధించి తాజాగా ఆర్‌బీఐ చర్చాపత్రాన్ని విడుదల చేసింది. ఈ ఏడాది ఫిబ్రవరి 13లోగా అభిప్రాయాలను తెలియజేయాలని ప్రజలను, వాటాదారులను కోరింది. గత కొన్ని సంవత్సరాలుగా ఆర్‌బీఐ బలహీనంగా ఉన్న యూసీబీలను విలీనం చేయడం లేదా పనితీరు సరిగా లేని బ్యాంకులను మూసివేయడం ద్వారా వాటి సంఖ్యను తగ్గించింది. అయినప్పటికీ, అనేక యూసీబీలు ఇప్పటికీ బలహీన పనితీరుతో కొనసాగుతున్నాయి. కొన్ని ఆర్‌బీఐ ఆంక్షల పరిధిలో ఉన్నాయి.**

**గతంలో జరిగిన చిన్న యూసీబీలే ఎక్కువగా నష్టాలను చూశాయి. దీన్ని దృష్టిలో ఉంచుకుని పెద్ద, మెరుగైన నిర్వహణ కలిగిన సహకార బ్యాంకులకు మాత్రమే లైసెన్సులను అనుమతించే అవకాశాలు ఉన్నాయి. ఇలాంటి యూసీబీలు సాధారణంగా మెరుగైన నిర్వహణ, సుదీర్ఘ అనుభవం, తక్కువ రిస్క్ కలిగి ఉంటాయి. ఈ నేపథ్యంలో కొత్త లైసెన్సుల కోసం ఆర్‌బీఐ కఠినమైన షరతులను సూచించింది. ఒక యూసీబీ కనీసం 10 ఏళ్లుగా పనిచేస్తూ ఉండాలి. గత 5 ఏళ్ల మంచి ఆర్థిక రికార్డును కలిగి ఉండాలి. రూ. 300 కోట్ల మూలధనం, కనీసం 12 శాతం మూలధన సమృద్ధి నిష్పత్తి, 3 శాతం కంటే తక్కువ మొండి బకాయిలు ఉండాలి. కాగా, 2025, మార్చి నాటికి, దేశంలో 1,457 యూసీబీలు ఉన్నాయి. వాటి మొత్తం ఆస్తుల విలువ రూ. 7.38 లక్షల కోట్లు, రూ. 5.84 లక్షల**

## అరుదైన ఘనతను సాధించిన అదానీ సోలార్




**దేశీయ అదానీ సోలార్ సంస్థ అరుదైన ఘనతను సొంతం చేసుకుంది. ప్రపంచ క్లీన్ ఎనర్జీ ఉత్పత్తిలో భారత్ స్థానాన్ని మెరుగుపరుస్తూ, ప్రముఖ వుడ్ మెకెంజీ ర్యాకింగ్స్‌లో అదానీ సోలార్‌కు చోటు దక్కింది. వుడ్ మెకెంజీ గ్లోబల్ సోలార్ మాడ్యూల్ తయారీ ర్యాంకింగ్‌లో స్థానం సంపాదించిన ఏకైక భారతీయ కంపెనీ అదానీ సోలార్ నిలిచింది. అదానీ న్యూ ఇండస్ట్రీస్‌కు చెందిన అదానీ సోలార్‌కు అంతర్జాతీయంగా 8వ ర్యాంకు లభించడమే కాకుండా, గ్రేడ్ ఏ రేటింగ్ లభించింది. నాణ్యత, ఆర్థిక బలం, పనితీరు, విశ్వసనీయత వంటి అంశాల ఆధారంగా కంపెనీకి ఈ గౌరవడం దక్కింది. ఈ జాబితాలో చైనా కంపెనీలు ఇప్పటికీ అగ్రస్థానాల్లో ఆధిపత్యం చెలాయిస్తున్నప్పటికీ, అదానీ సోలార్ ఉనికి భారత్‌ను ప్రపంచవ్యాప్తంగా మరింత పోటీకి నిలబెట్టింది. గతేడాది మొదటి ఆరునెలలకు సంబంధించి వుడ్ మెకెంజీ తన తాజా నివేదికను విడుదల చేసింది. ఇది సోలార్ ప్యానెల్ కంపెనీలకు సంబంధించిన షిప్‌మెంట్‌లు, బ్యాంకింగ్, పనితీరును తనిఖీ చేస్తుంది. దాదాపు 38 కంపెనీలను సమీక్షించి వుడ్ మెకెంజీ తన నివేదికను రూపొందించింది. ఇందులో జేఏ సోలార్ 91.7 పాయింట్లు, ట్రినాసోలార్ 91.6 పాయింట్లతో సంయుక్తంగా టాప్ ర్యాంకులో నిలిచాయి. అదానీ సోలార్ 81 పాయింట్లను సాధించింది. అలాగే, గ్రేడ్ ఏ రేటింగ్ ద్వారా కంపెనీ అత్యున్నత పనితీరు, పారదర్శకత ప్రమాణాలను సూచిస్తుంది. కాగా, 2025 నాటికి అదానీ సోలార్ దేశీయ, అంతర్జాతీయ మార్కెట్లలో 15,000 మెగావాట్ల కంటే ఎక్కువ సౌర మాడ్యూళ్లను రవాణా చేసింది. ఇందులో 10,000 మెగావాట్లు దేశీయంగా, మిగిలిన 5,000 మెగావాట్లు విదేశాలకు ఎగుమతి చేసింది. ఇదే సమయంలో కంపెనీ 8,000 కంటే ఎక్కువ ప్రత్యక్ష ఉద్యోగాలు, భారీగా పరోక్ష ఉద్యోగాలను సృష్టించింది.**

# నేడు రెండు తెలుగు రాష్ట్రాల్లో గ్యాస్ సిలిండర్ ధరలు

**నిత్యావసర వస్తువుల్లో ఒకటైన గ్యాస్ సిలిండర్ ధరలు అంతర్జాతీయ ముడి చమురు ధరలపై ఆధారపడి ఉంటాయి. గత కొద్ది నెలలుగా స్థిరంగా ఉంటున్న గ్యాస్ సిలిండర్ ధరలను (Gas cylinder prices) ఆయిల్ కంపెనీలు భారీగా పెంచాయి. నూతన సంవత్సర వేళ వాణిజ్య గ్యాస్ సిలిండర్ (Commercial gas cylinder) ధరలు పెంచుతూ చమురు మార్కెటింగ్ కంపెనీలు నిర్ణయం తీసుకున్నాయి. 19 కిలోల కమర్షియల్ ఎల్పీజీ (LPG) సిలిండర్ ధరను రూ. 111 పెంచాయి. ఈ పెంపుతో దేశ రాజధాని ఢిల్లీలో 19 కిలోల కమర్షియల్ సిలిండర్ ధర రూ. 1691.50 కి చేరుకుంది.**

అలాగే రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో డిసెంబర్ వరకు 1595.50కి లభించగా.. పెరిగిన ధరతో రూ. 1706. 50లకు ధరకు అందుబాటులో ఉంది. కేవలం కమర్షియల్ సిలిండర్లనే కాకుండా, 5 కిలోల ఎఫ్‌టిఎల్ (FTL) సిలిండర్ల ధరను కూడా రూ. 27 పెంచుతున్నట్లు కంపెనీలు ప్రకటించాయి. అయితే గృహ వినియోగ (Domestic) ఎల్పీజీ సిలిండర్ల ధరల్లో మాత్రం ఆయిల్ కంపెనీలు ఎటువంటి మార్పు చేయలేదు. కాగా నూతన సంవత్సర ప్రారంభంలోనే వాణిజ్య సిలిండర్ ధరలు పెరగడం హోటళ్లు, రెస్టారెంట్ల నిర్వాహకులపై అదనపు భారం పడింది. ఈ క్రమంలో రెండు తెలుగు రాష్ట్రాల్లో గ్యాస్ సిలిండర్ ధరలు ఎలా ఉన్నాయో ఇప్పుడు తెలుసుకుందాం..

హైదరాబాద్: రూ.905
వరంగల్: రూ.924
విశాఖపట్నం: రూ.861
విజయవాడ: రూ.875
గుంటూరు: రూ. 877






## పట్టాలెక్కబోతున్న మమిత లవ్‌స్టోరీ



దేవదాస్ సార్' అంటూ.. ఇటీవలే 'డ్యూడ్' చిత్రంలో కనిపించి థియేటర్లో ప్రేక్షకుల్ని అలరించింది మలయాళ నటి మమితా బైజు. అగ్ర తారలతో పాటు యువ కథానాయకుల చిత్రాలలోనూ నటిస్తూ.. చకాచకా ప్రాజెక్టులను పట్టాలెక్కించేస్తోందీ భామ. తాజాగా మమిత మరో సినిమా చిత్రీకరణకు సన్నద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. గతేడాది మమిత, సంగీత్ ప్రతాప్ ప్రధాన పాత్రల్లో పేరు ఖరారు చేయని ఓ చిత్రాన్ని ప్రకటించారు. తాజాగా ఈ సినిమా చిత్రీకరణను ఏప్రిల్ నుంచి ప్రారంభించనున్నట్లు సన్నిహిత వర్గాల సమాచారం. ప్రేమకథా నేపథ్యంలోనే తెరకెక్కుతోన్న ఈ సినిమా ఆషిక్ ఉస్మాన్ సమర్పణలో రూపొందుతోంది. మమిత ప్రస్తుతం నివిన్ పౌలీ సరసన 'బెత్లెహెం కుడుంబ యూనిట్' అనే చిత్రాన్ని చేస్తోంది. ఈ సినిమాకి 'ప్రేమలు' ఫేమ్ గిరీశ్ ఏ.డి దర్శకత్వం వహిస్తున్నారు. తమిళ నటుడు విజయ్ 'జన నాయకుడు' చిత్రంలోనూ మమిత నటించింది. ఇంకా ఆమె ఖాతాలో నటుడు సూర్యతో కలిసి ఓ చిత్రంతో పాటు పలు తమిళ చిత్రాలు ఉన్నాయి.

## ఈసారి జపనీస్ నేర్చుకొని వస్తా!



గతేడాది 'ది గర్ల్‌ఫ్రెండ్', 'కుబేర' లాంటి వరుస సినిమాలతో తెరపై సందడి చేసింది కథానాయిక రష్మిక. ప్రస్తుతం 'మైసా'తో అలరించడానికి ముస్తాబవుతోందీ తార. ఆమె.. అల్లుఅర్జున్ జంటగా నటించిన 'పుష్ప 2: ది రూల్' ఇటీవలే జపాన్‌లో 'పుష్ప క్రునిన్' పేరుతో విడుదలైన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే ప్రచార కార్యక్రమాల్లో భాగంగా జపాన్ వెళ్లిన రష్మికకు అక్కడి ప్రేక్షకులు తమ అభిమానాన్ని చాటుకుంటూ పలు బహుమతులు, లేఖలు అందించారు. తాజాగా ఈ విషయాన్ని తెలుపుతూ.. ఇన్‌స్టా వేదికగా ఓ పోస్ట్‌ను పెట్టిందామె. "జపాన్‌లో ఒకరోజు ఉన్నా. ఆ ఒక్కరోజులోనే నాకు అంతులేని ప్రేమ లభించింది. ఎన్నో లేఖలు, బహుమతులు. వాటన్నింటినీ చదివాను. బహుమతులన్నీ ఇంటికి తెచ్చుకున్నాను. ఇవన్నీ చూస్తుంటే ఎంత భావోద్వేగానికి గురయ్యానో మాటల్లో చెప్పలేను. మీ ప్రేమకు ధన్యవాదాలు. నేను మళ్లీ వస్తాను. ఈసారి ఎక్కువ రోజులు ఉండేలా ప్లాన్ చేసుకుంటా. మళ్లీ వచ్చినప్పుడు కచ్చితంగా జపనీస్ నేర్చుకొని వస్తా" అని ఆ పోస్ట్‌లో పేర్కొంది రష్మిక.



## వరుస మారి... విజయ తీరం చేరి






'కుడి ఎడమైతే పొరపాటు లేదోయ్.. ఓడిపోలేదోయ్'' అంటాడు దేవదాస్. కొన్నిసార్లు సినీతారల సినిమాలు కూడా ఇలా కుడిఎడమవుతుంటాయి. ఎప్పుడో గుమ్మడికాయ కొట్టేసుకున్న సినిమా తెరపైకి వచ్చేలోపు.. దానికన్నా వెనక శ్రీకారం చుట్టుకున్న చిత్రం బాక్సాఫీస్ బరిలో నిలిచి హిట్టు కొట్టడం అప్పుడప్పుడూ జరుగుతుంటుంది. ఇప్పుడలాంటి మ్యాజిక్ అనుభవమే తెలుగులో పలువురు కథానాయకులకు ఎదురైంది. ఈ సంక్రాంతి బరిలో 'మన శంకర వరప్రసాద్ గారు'గా వినోదాలు పంచుతున్నారు కథానాయకుడు చిరంజీవి. 'సంక్రాంతికి వస్తున్నాం' విజయం తర్వాత అనిల్ రావిపూడి తెరకెక్కించిన చిత్రమిది. ఆరు రోజుల్లోనే రూ.261కోట్ల గ్రాస్ రాబట్టి ఇప్పుడు రూ.300కోట్ల క్లబ్‌కు చేరువైంది. చిరు కెరీర్‌లోనే బిగ్గెస్ట్ బ్లాక్‌బస్టర్‌గా నిలవబోతోంది. అయితే నిజానికిది చిరు లైనప్ ప్రకారం 'విశ్వంభర' తర్వాత రావాల్సిన సినిమా. దానికి గుమ్మడికాయ కొట్టే నాటికి ఈ చిత్రమే పట్టాలెక్కలేదు. కానీ, గ్రాఫిక్స్ పనులు ఆలస్యమవడంతో గతేడాది తెరపైకి రావాల్సిన 'విశ్వంభర' ఈ వేసవికి వాయిదా పడింది. దీంతో ఈ గ్యాప్‌లోనే అనిల్ జెట్ స్పీడ్‌తో 'మన శంకర వరప్రసాద్..'ని సిద్ధం చేసేయడం.. ముగ్గుల పండగ బరిలో దూకి హిట్టు మాట వినిపించేయడం చకచకా జరిగిపోయాయి. ఇప్పుడీ విజయంతో చిరు వశిష్ఠల చిత్రంపై ప్రేక్షకుల్లో అంచనాలు రెట్టింపయ్యాయి. దీంతో దాని మార్కెట్ లెక్కలు పూర్తిగా మారనున్నట్లు అర్థమవుతోంది. ప్రస్తుతం నిర్మాణానంతర పనుల్లో ఈ సినిమా త్వరలోనే విడుదల తేదీ ప్రకటించుకొని ప్రచారాన్ని పదునెక్కించనుంది.

ఈ పండక్కి చిరుతో పాటు బాక్సాఫీస్ బరిలో నిలిచి ఓ చక్కటి విజయాన్ని ఖాతాలో వేసుకున్న మరో హీరో శర్వానంద్. ప్రస్తుతం ఆయన నటించిన 'నారీ నారీ నడుమ మురారి' థియేటర్లలో ప్రేక్షకుల్ని కడుపుబ్బా నవ్విస్తోంది. వాస్తవానికి ఇది శర్వా మరో సినిమా 'బైకర్' తర్వాత తెరపైకి రావాల్సి ఉంది. దాన్ని తొలుత డిసెంబరు 6న విడుదల చేయనున్నట్లు ప్రకటించినప్పటికీ కొన్ని కారణాల వల్ల వాయిదా వేశారు. దీంతో అది జనవరి బరిలో నిలవనున్నట్లు ప్రచారం సాగినప్పటికీ.. శర్వా పండక్కి తగ్గట్లుగా 'నారీ నారీ..'ని బరిలో దింపేందుకు మొగ్గు చూపడంతో వెనక రావాల్సిన సినిమా ముందుగా ప్రేక్షకుల్ని పలకరించింది. ఇప్పుడా వ్యూహానికి మంచి ఫలితం దక్కడంతో 'బైకర్'పైనా ఒక్కసారిగా అంచనాలు రెట్టింపయ్యాయి. ప్రస్తుతం నిర్మాణానంతర పనుల్లో ఉన్న ఈ రేసింగ్ నేపథ్య చిత్రం ఈ వేసవిలోనే థియేటర్లలోకి రానుంది. త్వరలోనే దీని విడుదల తేదీపై స్పష్టత రానుంది.

బెల్లంకొండ సాయి శ్రీనివాస్ గతేడాది 'కిష్కింధపురి'తో చక్కటి విజయాన్ని ఖాతాలో వేసుకున్న సంగతి తెలిసిందే. గత సెప్టెంబరులో ప్రేక్షకుల్ని పలకరించిన ఈ హారర్ థ్రిల్లర్ బాక్సాఫీస్ బరిలో మంచి వసూళ్లనే దక్కించుకుంది. అయితే నిజానికి సాయి శ్రీనివాస్ లైనప్ ప్రకారం దీని కన్నా ముందు విడుదలకు సిద్ధమైన చిత్రం మరొకటుంది. అదే 'టైసన్ నాయుడు'. గతేడాది వేసవిలోనే తెరపైకి రావాల్సిన ఈ సినిమా రకరకాల కారణాల వల్ల వాయిదా పడుతూ వచ్చింది. ఈలోగానే శ్రీనివాస్ నుంచి 'భైరవం'తో పాటు 'కిష్కింధపురి' బయటకు రావడం.. అది విజయాన్ని అందుకోవడం జరిగాయి. ఇప్పుడీ ఆలస్యం ఒకరకంగా 'టైసన్ నాయుడు'కి కూడా కలిసొచ్చినట్లయింది. ప్రస్తుతం తుది మెరుగులు దిద్దుకుంటున్న ఈ సినిమా ఈ వేసవికే థియేటర్లలో సందడి చేయనుంది.

### విజయ్ లెక్క మారనుంది!

కథానాయకుడు విజయ్ దేవరకొండ తన 14వ చిత్రాన్ని రాహుల్ సంకృత్యాన్ దర్శకత్వంలో.. 15వ సినిమాని దర్శకుడు రవికిరణ్ కోలాతో చేస్తున్న సంగతి తెలిసిందే. ఆ రెండూ ప్రస్తుతం సమాంతరంగా చిత్రీకరణ చేసుకుంటున్నాయి. కానీ, వీటిలో తొలుత తెరపైకి వచ్చేది రవికిరణ్ తెరకెక్కిస్తున్న 'రౌడీ జనార్ధన' అనే తెలుస్తోంది. రాహుల్ సినిమా స్కేల్ పరంగా.. సెటప్ పరంగా భారీ హంగులతో కూడిన సినిమా కావడం.. చిత్రీకరణకు కాస్త ఎక్కువ సమయం కావాల్సి ఉండటం వల్ల విజయ్ తొలుత రవికిరణ్ చిత్రాన్ని పూర్తి చేయడంపై దృష్టి సారించినట్లు తెలిసింది. ఈ రూరల్ యాక్షన్ డ్రామా ఈ ఏడాది డిసెంబరులో తెరపైకి రానున్నట్లు ఇప్పటికే అధికారికంగా ప్రకటించారు.

## మహిళలకు బలాన్నిచ్చే చిత్రం



మర్దానీ 3'లో పోలీసు అధికారిణిగా తుపాకి చేతపట్టి.. నిందితుల్ని పరుగులు పెట్టించడానికి సన్నద్ధమవుతోంది బాలీవుడ్ సీనియర్ కథానాయిక రాణీ ముఖర్జీ. హిందీ ప్రేక్షకుల్ని విశేషంగా ఆకట్టుకున్న 'మర్దానీ' ఫ్రాంచైజీలో రాబోతున్న మూడో భాగమిది. అభిరాజ్ మినావాలా దర్శకత్వం వహించారు. ఇటీవలే విడుదలైన ట్రైలర్ సినిమాపై అంచనాల్ని పెంచింది. మహిళలు, పిల్లలపై జరిగే నేరాల కథాంశంతో దీన్ని తీర్చిదిద్దారు. ఈ నెల 30న రాబోతుందీ సినిమా. ఈ నేపథ్యంలోనే ఇటీవలే ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న రాణి ఈ సినిమా గురించి కొన్ని ఆసక్తికర విషయాల్ని పంచుకుంది. "మర్దానీ 3' కేవలం ఒక సినిమా మాత్రమే కాదు. దీన్ని చూసినప్పుడు ప్రేక్షకుల్లో అవగాహన పెరుగుతుంది. ప్రతి మహిళకు ఆశ, బలాన్నిచ్చే కథ. అందుకే ఈ చిత్రానికి నేను ఎక్కువ ప్రాధాన్యత ఇస్తా. ప్రతి స్త్రీ ఈ సినిమా చూసి ప్రేరణ పొందాలని కోరుకుంటున్నా" అని చెప్పుకొచ్చింది. యశ్‌రాజ్ ఫిల్మ్స్ ఈ చిత్రాన్ని నిర్మించింది.

## కలాంకావల్.. సైకో కిల్లర్‌గా మమ్ముట్టి.. మలయాళ బ్లాక్‌బస్టర్ ఎలా ఉంది?

ప్రతి మనిషికి ఒక్కో పనిచేస్తే ఆనందం, సుఖం కలుగుతాయి. మనల్ని దోమ కుడితే, దాన్ని కొట్టి చంపుతాం. ఆ క్రమంలో కొన్ని ఎగిరిపోతాయి. కానీ, ఒకట్రెండు మన చేతుల్లో చచ్చిన తర్వాత చిన్నపాటి సంతృప్తి కలుగుతుంది. ఆ విజయ పరంపరను కొనసాగిస్తూ ఇంకొన్ని దోమల్ని చంపుతాం. ప్రపంచాన్ని గెలిచినంత ఆనందం కలుగుతుంది. కొందరు చికెన్ కోసం కోడిని కోస్తారు. అలా కోసినప్పుడు అది గిలగిలా కొట్టుకుంటున్నా, దాన్ని కూర వండుకు తింటే వచ్చే మజా గురించే ఆలోచిస్తారు. అదొక ఆనందం. అలాగే పాము కనపడితే, కొట్టి చంపే వరకూ ఊరుకోం. ఇతర ప్రాణులను చంపే విషయంలో ఒక్కొక్కరికి సంతోషం ఒక్కో స్థాయిలో ఉంటుంది. కానీ, స్టాన్లీదాస్‌కు ఎక్కువ సుఖాన్ని ఇచ్చేది మనిషిని చంపడంలోనే. సినిమా మొదలైన పది నిమిషాలకే ఇది అర్థమైపోతుంది. అందుకే 'కలాం కావల్' ఒక్కసారి చూడటం మొదలుపెడితే, ఎండింగ్ వరకూ ఆపకుండా ఉండలేం. అంతలా ఆసక్తికర కథనంతో జితిన్ కె.జోస్ ఈ కథను తీర్చిదిద్దారు.స్టాన్లీ దాస్ (మమ్ముట్టి) ఒంటరిగా ఉండే మహిళలే లక్ష్యంగా వారికి దగ్గరవుతుంటాడు. వివాహం చేసుకుంటానని చెప్పి, వాళ్లతో గడిపి అదే రోజు హత్య చేస్తాడు. కేరళతమిళనాడు సరిహద్దు గ్రామాల్లో మహిళలు కనిపించకుండా పోవడంతో ఇరు రాష్ట్రాల పోలీసులు దీనిపై విచారణ చేస్తుంటారు. కేరళ పోలీసులు ఈ కేసు విచారణకు ఎస్సై జయకృష్ణన్ (వినాయకన్) ను నియమిస్తారు. స్టాన్లీదాస్ హత్యలు చేయడానికి కారణం ఏంటి? పోలీసులకు దొరక్కుండా అతడు అనుసరించిన విధానాలు ఏంటి? జయకృష్ణన్ ఈ కేసును ఎలా ఛేదించాడు? అన్నది చిత్ర కథ.

స్టాన్లీదాస్ తన మాయమాటలతో మహిళను లోబరుచుకుని హత్య చేసే సన్నివేశంతోనే కథను మొదలుపెట్టాడు దర్శకుడు. ఒకవైపు జయకృష్ణన్ ఇన్వెస్టిగేషన్, మరోవైపు స్టాన్లీ హత్యలు ఇలా కథ, కథనాలను సమాంతరంగా నడపుతూ వచ్చాడు. కథ నేపథ్యాన్ని 2000 సంవత్సరంలో జరిగినట్లు చూపించడంతో ఎక్కడా లాజిక్ మిస్ కాదు. అప్పుడప్పుడే వినియోగంలోకి వచ్చిన మొబైల్‌ఫోన్లు, గ్రామాల్లో ఉండే మహిళల అమాయకత్వం వీటిని ఆసరాగా చేసుకుని స్టాన్లీ సాగించే వేట.. ఇలా ఆద్యంతం కథ ఆసక్తికరంగా సాగుతుంది. హత్యలు చేస్తున్న నిందితుడి కోసం జయకృష్ణన్ సాగించే ఇన్వెస్టిగేషన్, ఆధారాలు సంపాదించేందుకు అతడు పడే కష్టం చూస్తే, సాంకేతికత అంతగా అందుబాటులో లేని కాలంలో పోలీసులు ఎలా కష్టపడేవారో తీర్చిదిద్దిన సన్నివేశాలు అలరిస్తాయి.విరామ సన్నివేశాలకు స్టాన్లీ అసలు స్వరూపాన్ని చూపించి ఊహించని ట్విస్ట్ ఇచ్చాడు దర్శకుడు. అక్కడి నుంచి కథ, కథనాలు మరింత ఉత్కంఠగా సాగుతాయి. జయకృష్ణన్‌కు దగ్గరగా ఉంటూనే, అతడు చేసే ఇన్వెస్టిగేషన్‌ను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ స్టాన్లీ కొత్త ఎత్తులు వేయడం, పోలీసులు వాటిని కనిపెట్టేలోపు హత్యలు జరిగిపోవడం మరింత థ్రిల్ పంచుతుంది. అసలు స్టాన్లీని పోలీసులు పట్టుకుంటారా? అన్న ఉత్కంఠ ప్రేక్షకుడిని వెంటాడుతూనే ఉంటుంది. స్టాన్లీనే మహిళల హత్యలకు కారణమని జయకృష్ణన్ గుర్తించే సీన్, క్లైమాక్స్‌లో వచ్చే ట్విస్ట్‌లు సినిమాకే హైలైట్. అది తెరపైనే చూడాలి. (kalamkaval review telugu) ఆ ట్విస్ట్‌లకేనేమో ఈ మూవీ మలయాళ బాక్సాఫీస్ వద్ద రూ.80 కోట్లకు పైగా వసూలు చేసింది.నీరు ఏ పాత్రలో పోస్తే ఆ రూపాన్ని సంతరించుకుంటుంది. మలయాళ ఇండస్ట్రీలో మమ్ముట్టి కూడా అంతే. మొన్న 'భ్రమయుగం'లో రాక్షసుడిలా కనిపించారు.. నిన్న 'కథల్ ది:కోర్'లో గే పాత్రలో నటించారు. ఇప్పుడు 'కలాంకావల్'లో పైకి సాధారణ మనిషిగానే కనిపించినా అణువణువు విషం నింపుకొన్న సైకో కిల్లర్‌గా అదరగొట్టారు. ఆయన తెరపై నటిస్తుంటే మమ్ముట్టి కనిపించడు. కేవలం సైకో కిల్లర్ స్టాన్లీదాస్ మాత్రమే కనిపిస్తాడు. అంతలా ఒదిగిపోయారు. ఇక ఎస్సై జయకృష్ణన్‌గా వినాయకన్ కూడా తనదైన నటనతో మెప్పించారు. 'జైలర్'లో వర్మగా చేసింది ఈయనేనా అన్నంతలా ఆశ్చర్యపరిచారు. క్లైమాక్స్‌లో అటు మమ్ముట్టి, ఇటు వినాయకన్‌ల నటన మరో స్థాయిలో ఉంటుంది. (kalamkaval review telugu) రజీషా విజయన్ సినిమాను మలుపు తిప్పే పాత్ర. మిగిలిన వాళ్లు పరిధి మేరకు నటించారు. సాంకేతికంగా సినిమా బాగుంది. మమ్ముట్టిలాంటి నటుడిని సైకో కిల్లర్‌గా చూపించాలని దర్శకుడు జితిన్ కె జోస్ విజన్‌కు హ్యాట్సాఫ్ చెప్పాల్సిందే. నిడివి కాస్త తగ్గించే ఉంటే సినిమా మరింత షార్ప్‌గా ఉండేది.

కుటుంబంతో చూడొచ్చా: ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడొచ్చు. అసభ్య సన్నివేశాలు, సంభాషణలు అస్సలు లేవు. సోనీలివ్ వేదికగా తెలుగులో ఆడియోలోనూ అందుబాటులో ఉంది.

బలాలు
+ కథ, కథనాలు
+ మమ్ముట్టి, వినాయకన్‌ల నటన
+ ఇంటర్వెల్, క్లైమాక్స్ ట్విస్ట్‌లు


బలహీనతలు
ప్రథమార్ధంలో కొన్ని సన్నివేశాలు

చివరిగా: ఎంగేజింగ్ క్రైమ్ థ్రిల్లర్ 'కలాం కావల్' (kalamkaval review telugu)

గమనిక: ఈ సమీక్ష సమీక్షకుడి దృష్టి కోణానికి సంబంధించింది. ఇది సమీక్షకుడి వ్యక్తిగత అభిప్రాయం మాత్రమే!

రివ్యూ





# ఎందుకిలా..

సొంతగడ్డపై టీమ్‌ఇండియా ఒకప్పుడు తిరుగులేని శక్తి. కానీ క్రమంగా ఆధిపత్యాన్ని కోల్పోతోంది. స్వదేశంలో సిరీస్‌లంటే అలవోకగా చేజిక్కించుకునేది.. ఇప్పుడు ఆపసోపాలు పడుతోంది. న్యూజిలాండ్‌తో ముగిసిన వన్డే సిరీస్.. పడిపోతున్న భారత జట్టు ప్రమాణాలకు తాజా నిదర్శనం. 2024లో ఇక్కడ మొట్టమొదటిసారి టెస్టు సిరీస్ గెలిచిన (అది కూడా 30తో) కివీస్.. ఇప్పుడు తొలిసారి ఈ దేశంలో వన్డే సిరీస్‌నూ నెగ్గి టీమ్‌ఇండియాకు షాకిచ్చింది. గతంలో నాలుగు ఐసీసీ టోర్నీలు సహా వన్డే క్రికెట్ ఆడేందుకు 16సార్లు భారత్‌కు వచ్చినా.. విఫలమైన కివీస్‌కు చేజేతులా వన్డే సిరీస్ అప్పగించిన ఘనత కెప్టెన్ శుభ్‌మన్ గిల్, చీఫ్ కోచ్ గౌతమ్ గంభీర్‌లదే అనడంలో సందేహం లేదు!

ఎనిమిది మంది ఆటగాళ్లు తొలిసారిగా భారత పర్యటనకు వచ్చినా.. క్రమశిక్షణతో కూడిన ఆటతీరుతో కివీస్ వన్డే సిరీస్‌ను ఎగరేసుకుపోయింది. భారత జట్టు మాత్రం ప్రణాళిక లోపాలు, గందరగోళ వ్యూహాలతో ఘోరంగా తడబడింది. బ్యాటింగ్‌లో అస్థిరత్వం.. బౌలింగ్‌లో ప్రభావం చూపకపోవడం ఆ జట్టును దెబ్బతీశాయి. బౌలింగ్ గురించి ఎంత తక్కువ చెబితే అంత మంచిది. మన బౌలర్లు పవర్ ప్లేలో వికెట్లు తీయలేకపోవడం కివీస్ బ్యాటర్లకు బాగా కలిసొచ్చింది. ఈ సిరీస్‌లో భారత బౌలర్లు ఓవర్‌కు సగటున 6.2 పరుగులు ఇచ్చారు. గత దశాబ్ద కాలంలో భారత్‌లో జరిగిన వన్డే సిరీస్‌లలో ఇదే అత్యధికం. ప్రత్యర్థిని స్పిన్‌తో కట్టడి చేయలేకపోవడం.. అదే సమయంలో స్పిన్‌ను ఎదుర్కోవడంలో తడబడడం భారత్‌ను దెబ్బతీసింది. జడేజా సిరీస్‌లో ఒక్కటంటే ఒక్క వికెట్ పడగొట్టలేకపోయాడు. కుల్‌దీప్ ధారాళంగా పరుగులిచ్చాడు. బ్యాటర్లలో విరాట్ కోహ్లి, కేఎల్ రాహుల్ మినహా మిగతా వాళ్లు స్థాయికి తగ్గట్లు ఆడలేకపోయారు. మిడిల్ ఓవర్లలో పరుగుల వేటలో వెనుకబడడం భారత్‌కు ప్రతికూలంగా మారింది. ఫీల్డింగ్‌లోనూ ఆరు క్యాచ్‌లు వదిలేసి మూల్యం చెల్లించుకుంది. కోచ్ గంభీర్ అస్పష్టమైన వ్యూహాలు సైతం భారత ఓటమికి దారితీశాయని చెప్పొచ్చు. ఆటగాడిగా దూకుడును ప్రదర్శించిన గంభీర్.. కోచ్‌గా అంచనాలను అందుకోలేకపోతున్నాడు. ఫామ్‌లో లేని జడేజాను పదే పదే ఆడిస్తుండటం.. అక్షర్ పటేల్ వంటి యువ ఆటగాళ్లను పక్కన పెట్టడం గంభీర్ వ్యూహాత్మక తప్పిదాలలో ఒకటి. తాను బాధ్యతలు చేపట్టాక సొంతగడ్డపై కివీస్, దక్షిణాఫ్రికాలకు టెస్టు సిరీస్‌లు కోల్పోయిన నేపథ్యంలో ఇప్పటికే విమర్శలు ఎదుర్కొంటున్న గంభీర్.. ఇప్పుడు వన్డే సిరీస్ పరాభవంతో మరింత ఒత్తిడిని ఎదుర్కోనున్నాడు.

# కోహ్లి వీరోచిత పోరాటం వృథా.. ఇండోర్‌లో భారత్ ఓటమి

**విరాట్ శతకం వృథా**

**మూడో వన్డేలో భారత్ ఓటమి**

**న్యూజిలాండ్‌దే సిరీస్**

**మిచెల్, ఫిలిప్స్ సెంచరీలు**



మిచెల్ 137



ఫిలిప్స్ 106

సొంతగడ్డపై వన్డేల్లో టీమ్‌ఇండియా ఆధిపత్యానికి గండి. మూడేళ్ల తర్వాత మన జట్టు స్వదేశంలో వన్డే సిరీస్‌ను చేజార్చుకుంది. బంతితో తేలిపోయి, బ్యాటుతో తడబడిన భారత్.. మూడో వన్డేలో న్యూజిలాండ్‌కు తలవంచింది. మిచెల్, ఫిలిప్స్‌లు సూపర్ శతకాలతో కివీస్‌కు భారీ స్కోరును అందించగా.. ఛేదనలో టీమ్‌ఇండియా విఫలమైంది. కోహ్లి అద్భుత పోరాటంతో సెంచరీ సాధించినా.. ఫలితం లేకపోయింది. భారత్‌లో న్యూజిలాండ్ తొలిసారి వన్డే సిరీస్‌ను చేజిక్కించుకుంది.

ఇటీవల స్వదేశంలో ఓటములు చవిచూస్తున్న భారత జట్టుకు మరో చేదు అనుభవం. ఈసారి వన్డేల్లో దెబ్బతింది! న్యూజిలాండ్‌తో మూడు వన్డేల సిరీస్‌ను టీమ్‌ఇండియా కోల్పోయింది. బంతి, బ్యాట్‌తో విఫలమైన శుభ్‌మన్ బృందం మూడో వన్డేలో 41 పరుగుల తేడాతో ఓటమి చవిచూసింది. ఆదివారం మొదట కివీస్ 8 వికెట్లకు 337 పరుగులు చేసింది. డరిల్ మిచెల్ (137; 131 బంతుల్లో 15×4, 3×6) వరుసగా రెండో సెంచరీ చేయగా.. గ్లెన్ ఫిలిప్స్ (106; 88 బంతుల్లో 9×4, 3×6) కూడా శతకం సాధించాడు. అర్ష్‌దీప్, హర్షిత్ చెరో మూడు వికెట్లు పడగొట్టారు. భారీ ఛేదనలో భారత్ 46 ఓవర్లలో 296 పరుగులకే ఆలౌటైంది. విరాట్ కోహ్లి (124; 108 బంతుల్లో 10×4, 3×6) వీరోచిత సెంచరీ, నితీశ్‌కుమార్ రెడ్డి (53; 57 బంతుల్లో 2×4, 2×6), హర్షిత్ (52; 43 బంతుల్లో 4×4, 4×6) మెరుపులు భారత్‌ను గెలిపించలేకపోయాయి. జాక్ ఫౌక్స్ (3/77), క్లార్క్ (3/54), లెనాక్స్ (2/42) భారత్‌కు కళ్లెం వేశారు.

కోహ్లి శతకబాదినా..: భారత్ ఇన్నింగ్స్ కూడా న్యూజిలాండ్ ఇన్నింగ్స్‌నే తలపించింది. అయితే టీమ్‌ఇండియా ఫినిషింగ్ చేయలేకపోయింది. భారీ ఛేదనలో ఆరంభంలోనే భారత్‌కు ఎదురుదెబ్బ తగిలింది. రోహిత్‌శర్మ (11) తొలి వికెట్ రూపంలో ఔటయ్యాడు. కెప్టెన్ శుభ్‌మన్ గిల్ (23), శ్రేయస్ అయ్యర్ (3)తో పాటు గత మ్యాచ్‌లో సెంచరీ చేసిన రాహుల్ (1) కూడా తక్కువ స్కోరుకే వెనుదిరగడంతో భారత్ 71/4తో కష్టాల్లో చిక్కుకుంది. ఈ స్థితిలో నితీశ్‌కుమార్‌తో కలిసి కోహ్లి స్కోరును ముందుకు తీసుకెళ్లాడు. నియంత్రణతో కూడిన షాట్లతో అతడు స్కోరు పెంచాడు. కుదురుకున్నాక తన షాట్లు ఆడిన విరాట్.. 51 బంతుల్లో అర్ధసెంచరీ చేశాడు. నితీశ్‌కుమార్ నుంచి అతడికి చక్కటి సహకారం అందింది. మరోవైపు ఫౌక్స్ బౌలింగ్‌లో ఓ మెరుపు సిక్స్ బాదిన నితీశ్.. ఫిలిప్స్ వేసిన బంతినీ స్టాండ్స్‌లోకి కొట్టాడు. ఇదే క్రమంలో వన్డేల్లో తొలి అర్ధసెంచరీని నమోదు చేశాడు. సాధించాల్సిన రన్‌రేట్ మరీ ఎక్కువగా లేకపోవడం, కోహ్లినితీశ్ కుదురుకోవడంతో భారత్‌కు విజయావకాశాలు కనిపించాయి. కానీ నితీశ్‌ను ఔట్ చేసిన క్లార్క్..భారత్‌ను దెబ్బ కొట్టాడు. తర్వాత జడేజా (12) కూడా ఔటైపోవడంతో భారత్ 178/6తో ఇక కష్టమే అనిపించింది. ఈ స్థితిలో కోహ్లికి జత కలిసిన హర్షిత్ మెరుపు ఇన్నింగ్స్ ఆడాడు. ఎడాపెడా షాట్లు బాదిన అతడు సాధించాల్సిన రన్‌రేట్‌ను కరిగించాడు. మరోవైపు ఫౌక్స్ బౌలింగ్‌లో సిక్స్, ఫోర్ బాదిన కోహ్లి.. అదే జోరుతో 91 బంతుల్లో సెంచరీ చేశాడు. జేమీసన్ వేసిన 43వ ఓవర్లో కోహ్లిహర్షిత్ జంట 21 పరుగులు రాబట్టడంతో మ్యాచ్ ఆసక్తికరంగా మారింది. కానీ తర్వాతి ఓవర్లోనే వరుస బంతుల్లో హర్షిత్ రాణా, సిరాజ్ ఔట్ కావడంతో భారత్ పనైపోయింది. ఆఖరిదాకా పోరాడిన విరాట్.. తొమ్మిదో వికెట్ రూపంలో వెనుదిరిగాడు.

తడబడి నిలబడిన కివీస్: అంతకుముందు న్యూజిలాండ్ ఇన్నింగ్స్ మొదలైన తీరుకి.. ముగిసిన విధానానికి పొంతనే లేదు. 5 పరుగులకే 2 వికెట్లు.. 58కే 3 వికెట్లు ఇలా సాగింది ఆ జట్టు ఆట. కానీ భారీ స్కోరుతో ఇన్నింగ్స్‌ను ముగించిందంటే కారణం డరిల్ మిచెల్, గ్లెన్ ఫిలిప్స్‌ల సూపర్ బ్యాటింగే. గత మ్యాచ్ ఫామ్‌ను కొనసాగిస్తూ మిచెల్ మరో సెంచరీ బాదేయగా.. ఫిలిప్స్ సైతం శతకాన్ని అందుకోవడంతో భారత్ ముంగిట భారీ లక్ష్యం నిలిచింది. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన న్యూజిలాండ్ 7 బంతుల వ్యవధిలో ఓపెనర్లు నికోల్స్ (0), డెవాన్ కాన్వే (5) వికెట్లను కోల్పోయింది. ఈ స్థితిలో మిచెల్, విల్ యంగ్ (30; 41 బంతుల్లో 5×4, 1×6) నిలిచారు. దీంతో కివీస్ 12 ఓవర్లకు 58/2తో కాస్త కోలుకుంది. యంగ్ ఔటైన తర్వాత మిచెల్, ఫిలిప్స్ కివీస్‌ను నడిపించారు. గత వన్డేలో మాదిరే స్పిన్నర్ కుల్‌దీప్ బౌలింగ్‌లోనే మిచెల్ ఎదురుదాడికి దిగాడు. అతడు వేసిన తొలి ఓవర్ తొలి బంతికే సిక్సర్ బాదేశాడు. తర్వాత కుల్‌దీప్ బౌలింగ్‌లోనే మరో ఫోర్‌తో మిచెల్ 56 బంతుల్లో అర్ధసెంచరీ అందుకున్నాడు. 21 ఓవర్లకు 101/3తో కివీస్ కోలుకుంది. అడపాదడపా షాట్లు ఆడిన ఫిలిప్స్ 53 బంతుల్లో అర్ధసెంచరీ పూర్తి చేశాడు. చక్కని బ్యాటింగ్‌ను కొనసాగించిన మిచెల్.. జడేజా బౌలింగ్‌లో ఓ సింగిల్‌తో 106 బంతుల్లో సెంచరీ మార్కు అందుకున్నాడు. శతకం తర్వాత మిచెల్ మరింత రెచ్చిపోగా.. ఫిలిప్స్ కూడా బ్యాట్ ఝుళిపించాడు. కుల్‌దీప్ వేసిన 41వ ఓవర్లో సిక్స్, ఫోర్‌తో 90ల్లోకి వచ్చిన ఫిలిప్స్... 83 బంతుల్లోనే శతకం పూర్తి చేశాడు. కానీ స్వల్ప తేడాతో ఫిలిప్స్, మిచెల్‌లను భారత్ పెవిలియన్ చేర్చింది. ఫిలిప్స్‌ను అర్ష్‌దీప్ ఔట్ చేశాడు. దీంతో మూడో వికెట్‌కు మిచెల్‌ఫిలిప్స్ మధ్య 219 పరుగుల భారీ భాగస్వామ్యానికి భాగస్వామ్యానికి తెరపడింది. ఆ తర్వాత మిచెల్, మిచెల్ హే (2) కూడా స్వల్ప వ్యవధిలో ఔటైనా టెయిలెండర్లను భారత్ కట్టడి చేయలేకపోవడంతో కివీస్ భారీ స్కోరు చేసింది. బ్రాస్‌వెల్ (28 నాటౌట్; 18 బంతుల్లో 1×4, 3×6) న్యూజిలాండ్‌కు మెరుపు ముగింపునిచ్చాడు. భారత స్పిన్నర్లు మరోసారి విఫలమయ్యారు. హర్షిత్, అర్ష్‌దీప్ వికెట్లు తీసినా.. ధారాళంగా పరుగులు ఇచ్చేశారు.

**న్యూజిలాండ్ ఇన్నింగ్స్: కాన్వే (సి) రోహిత్ (బి) హర్షిత్ రాణా 5; నికోల్స్ అర్ష్‌దీప్ (బి) 0; యంగ్ (సి) జడేజా (బి) హర్షిత్ రాణా 30; మిచెల్ (సి) కుల్‌దీప్ (బి) సిరాజ్ 137; ఫిలిప్స్ (సి) రాహుల్ (బి) అర్ష్‌దీప్ 106; బ్రాస్‌వెల్ నాటౌట్ 28; మైకేల్ హే ఎల్బీ (బి) కుల్‌దీప్ 2; ఫౌల్క్స్ (సి) కుల్‌దీప్ (బి) అర్ష్‌దీప్ 10; క్లార్క్ (బి) హర్షిత్ 11; జేమీసన్ నాటౌట్ 0; ఎక్స్‌ట్రాలు 8 మొత్తం: (50 ఓవర్లలో 8 వికెట్లకు) 337; వికెట్ల పతనం: 1-5, 2-5, 3-58, 4-277, 5-283, 6-286, 7-304, 8-327; బౌలింగ్: అర్ష్‌దీప్ 10-1-63-3; హర్షిత్ రాణా 10-0-84-3; సిరాజ్ 10-0-43-1; నితీశ్ 8-0-53-0; కుల్‌దీప్ 6-0-48-1; జడేజా 6-0-41-0**

**భారత్ ఇన్నింగ్స్: రోహిత్ (బి) క్లార్క్ (బి) ఫౌక్స్ 11; శుభ్‌మన్ (బి) జేమీసన్ 23; విరాట్ కోహ్లి (సి) మిచెల్ (బి) క్లార్క్ 124; శ్రేయస్ (సి) ఫౌక్స్ (బి) క్లార్క్ 3; రాహుల్ (సి) ఫిలిప్స్ (బి) లెనాక్స్ 1; నితీశ్‌కుమార్ (సి) యంగ్ (బి) క్లార్క్ 53; జడేజా (సి) యంగ్ (బి) లెనాక్స్ 12; హర్షిత్ రాణా (సి) నికోల్స్ (బి) ఫౌక్స్ 52; సిరాజ్ (సి) హే (బి) ఫౌక్స్ 0; కుల్‌దీప్ రనౌట్ 5; అర్ష్‌దీప్ నాటౌట్ 4; ఎక్స్‌ట్రాలు 8 మొత్తం: (46 ఓవర్లలో ఆలౌట్) 296; వికెట్ల పతనం: 1-28, 2-45, 3-68, 4-71, 5-159, 6-178, 7-277, 8-277, 9-292; బౌలింగ్: జేమీసన్ 9-0-58-1; ఫౌక్స్ 9-0-77-3; క్లార్క్ 9-0-54-3; లెనాక్స్ 10-0-42-2; మిచెల్ 1-0-10-0; ఫిలిప్స్ 8-0-54-0**

# సియంగ్, లిన్ చున్‌లకు టైటిళ్లు



దిల్లీ: ఇండియా ఓపెన్ ప్రపంచ టూర్ సూపర్ 750 టోర్నీలో ఆన్ సియంగ్ (కొరియా), లిన్ చున్ యి (చైనీస్ తైపీ) విజేతలుగా నిలిచారు. మహిళల సింగిల్స్‌లో డిఫెండింగ్ ఛాంపియన్ సియంగ్ టైటిల్ నిలబెట్టుకోగా.. పురుషుల విభాగంలో లిన్ చున్ తొలిసారిగా ఛాంపియన్ అయ్యాడు. ఆదివారం జరిగిన ఫైనల్లో టాప్ సీడ్ సియంగ్ 21-13, 21-11తో రెండో సీడ్ యింగ్ జి యి (చైనా)పై విజయం సాధించింది. పురుషుల సింగిల్స్ టైటిల్ పోరులో లిన్ చున్ 21-10, 21-18తో మూడో సీడ్ జొనాథన్ క్రిస్టీ (ఇండోనేసియా)పై గెలుపొందాడు. పురుషుల డబుల్స్‌లో లియాంగ్ వీ కెంగ్- వాంగ్ చాంగ్ (చైనా) జంట టైటిల్‌ను చేజిక్కించుకుంది. ఫైనల్లో ఈ ద్వయం 17-21, 25-23, 21-16తో హిరోకి మిదరోకివా- కొహెయ్ యమషిత (జపాన్) జోడీని ఓడించింది. మహిళల డబుల్స్ ఫైనల్లో షెంగ్ షు- టాన్ నింగ్ (చైనా) 21-11, 21-18తో ఫుకుషిమ- మత్సుమోటో (జపాన్)పై గెలిచి టైటిల్‌ను గెలుచుకుంది. మిక్స్‌డ్ డబుల్స్‌లో దెచపోల్- సుపిసర (థాయ్‌లాండ్) జోడీ విజేతగా నిలిచింది. హోరాహోరీగా సాగిన ఫైనల్లో ఈ జంట 19-21, 25-23, 21-18తో మథియాస్ క్రిస్టియాన్సెన్- అలెగ్జాండ్రా బోయె (డెన్మార్క్) ద్వయంపై విజయం సాధించింది.



# విజయ్ హజారే విజేత విదర్భ

బెంగళూరు: విదర్భ అదరగొట్టింది. దేశవాళీ వన్డే టోర్నీ విజయ్ హజారే ట్రోఫీని తొలిసారి కైవసం చేసుకుంది. ఆదివారం జరిగిన ఫైనల్లో విదర్భ 38 పరుగుల తేడాతో సౌరాష్ట్రపై గెలిచింది. మొదట విదర్భ నిర్ణీత 50 ఓవర్లలో 8 వికెట్లకు 317 పరుగులు చేసింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అథర్వ తైదె (128; 118 బంతుల్లో 15×4, 3×6) అద్భుత శతకం సాధించాడు. అతడికి తోడు యశ్ రాథోడ్ (54), అమన్ మోఖడే (33) రాణించారు. అథర్వ, రాథోడ్ ద్వయం రెండో వికెట్‌కు 133 పరుగులు జోడించింది. అంకుర్ పన్వర్ నాలుగు వికెట్లతో మెరిశాడు. చిరాగ్ జాని, చేతన్ సకారియా చెరో రెండు వికెట్లు తీశారు. భారీ లక్ష్య ఛేదనలో సౌరాష్ట్ర.. 48.5 ఓవర్లలో 279 పరుగులకు ఆలౌటైంది. టోర్నీలో ఆ జట్టు తరఫున అత్యధిక పరుగులు చేసిన హార్విక్ దేశాయ్, సెమీఫైనల్ హీరో విశ్వరాజ్ జడేజా విఫలమవడం ఆ జట్టును దెబ్బ తీసింది. ప్రేరక్ మన్కడ్ (88), చిరాగ్ (64) పోరాటం సరిపోలేదు. యశ్ ఠాకూర్ నాలుగు, నచికేత్ భూటె మూడు వికెట్లు పడగొట్టారు.

## రోహిత్ 'పట్టు' తప్పుతోంది..

# మూడు వన్డేల్లోనూ ఒకేలా..

**టీమ్ ఇండియాలో రోహిత్ శర్మ (Rohit Sharma)కు హిట్‌మ్యాన్ అనే పేరు ఉంది. తను అనుకుంటే ఎలాంటి బంతినైనా బౌండరీకి తరలించేంత సత్తా ఉంది. అదంతా తన బలంతోపాటు టైమింగ్‌తో చేస్తూ వచ్చాడు. అందుకే బౌలర్ ఎంత మంచి బంతి వేసినా బౌండరీకి దారిచూపించాడు. కానీ న్యూజిలాండ్ సిరీస్‌లో ఒకే తప్ప మళ్లీ మళ్లీ మూడు సార్లు చేశాడు. దీంతో రోహిత్ 'పట్టు' ఎందుకు తప్పుతోంది అనే చర్చ మొదలైంది.**

న్యూజిలాండ్‌తో సిరీస్‌కి ముందు రోహిత్ శర్మ మంచి ఫామ్‌లోనే ఉన్నాడు. దక్షిణాఫ్రికాతో మూడు మ్యాచుల్లో వరుసగా 75, 14, 57 పరుగులు చేశాడు. అంతకుముందు ఆస్ట్రేలియాపై సెంచరీ (121*), అర్థ సెంచరీ (73) ఉన్నాయి. అందుకే కివీస్ సిరీస్‌లో హిట్ మ్యాన్ షో చూద్దామని ఫ్యాన్స్ ఫిక్స్ అయిపోయారు. కానీ సిరీస్ ముగిసే సమయానికి 'ఏమైంది రోహిత్‌కి.. ఎందుకిలా ఔటవుతున్నాడు?' అని ఆశ్చర్యపోయే పరిస్థితి నెలకొంది. కివీస్ సిరీస్ (India vs Newzealand)లో రోహిత్ స్కోర్లు చూస్తే మూడు మ్యాచుల్లో వరుసగా 26, 24, 11. ఈ మ్యాచుల్లో రోహిత్ షాట్ సెలక్షన్ బాగానే ఉన్నా.. బ్యాటు పట్టు తప్పుతోంది. మూడు మ్యాచుల్లో బంతి వేసే బౌలర్లు, పట్టే ఫీల్డర్ మారొచ్చు కానీ, ఒకేలా ఔటయ్యాడు. ప్రతిసారి షాట్ కొట్టేటప్పుడు చేతిలో బ్యాటు తిరిగిపోయింది. దాంతో పట్టు తప్పి.. టైమింగ్ కుదరక క్యాచ్ ఇచ్చి పెవిలియన్ చేరాడు. దీంతో జట్టులో స్థానంపై మరోసారి చెణుకులు మొదలయ్యాయి.అయితే, ఇలాంటి ఇబ్బందికర పరిస్థితుల్ని అర్థం చేసుకొని తనను తాను మర్చుకోవడంలో హిట్‌మ్యాన్ ఎప్పుడూ ముందుంటాడు. తన 'పట్టు'ను తిరిగి సాధించి తనేంటో నిరూపిస్తాడు. కాకపోతే వన్డేల్లో రోహిత్‌ని తిరిగి చూడాలంటే మరో ఆరు నెలలకుపైనే ఆగాలి. జులై 14 నుంచి ఇంగ్లాండ్ సిరీస్ మొదలవుతుంది. అప్పుడు టీమ్‌లోకి తీసుకుంటే తిరిగి ఇండియన్ జెర్సీ వేసుకుంటాడు.





## ప్రజ్ఞానందపై అర్జున్ విజయం

విజ్క్ ఆన్ జీ (నెదర్లాండ్స్): టాటా స్టీల్ మాస్టర్స్ చెస్ టోర్నీలో టాప్ సీడ్ అర్జున్ ఇరిగేశి శుభారంభం చేశాడు. మొదటి రౌండ్లో సహచర గ్రాండ్‌మాస్టర్ ప్రజ్ఞానందపై అర్జున్ విజయం సాధించాడు. ప్రపంచ ఛాంపియన్ దొమ్మరాజు గుకేశ్ డ్రాతో టోర్నీని మొదలుపెట్టాడు. ప్రపంచకప్ విజేత జవోఖిర్ సిందారోవ్ (ఉజ్బెకిస్తాన్)తో హోరాహోరీగా సాగిన గేమ్‌ను గుకేశ్ డ్రాగా ముగించాడు. మథియస్ బ్లూబామ్ (జర్మనీ)తో అరవింద్ చిదంబరం డ్రా చేసుకున్నాడు. అనీశ్ గిరి (నెదర్లాండ్స్)పై విన్సెంట్ కీమెర్ (జర్మనీ) గెలుపొందాడు.